

విజయవాడలో బుధవారం జరిగిన కూటమి ప్రజాప్రతినిధుల ఉమ్మడి సమావేశంలో పాల్గొన్న జిల్లా ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, పాశం సునీల్‌కుమార్, సుధీర్‌రెడ్డి, ఆరణి శ్రీనివాసులు తదితరులు


# రూ.1213 కోట్ల పెట్టుబడులు

# 4060 ఉద్యోగాలు

- తొలి వంద రోజుల్లో ప్రభుత్వ నిర్ణయాలతో జిల్లాకు లబ్ధి

కూటమి ప్రభుత్వం ఏర్పడి నేటికి వంద రోజులు అవుతోంది. కొత్త ప్రభుత్వ పాలనలో జిల్లాకు ఒనగూరింది ఏమిటి అని పరిశీలించడానికి వంద రోజులు అన్నది అత్యంత స్వల్ప సమయం. నిజానికి ఇంత స్వల్ప వ్యవధిలోనూ రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే జిల్లాకు భారీ లబ్ధి కలిగిందనే చెప్పాలి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



జిల్లాలో గత నెల 19వ తేదీన పర్యటించిన సీఎం చంద్రబాబు శ్రీసిటీలో రూ.1570 కోట్ల పెట్టుబడులతో 16 పరిశ్రమలు ప్రారంభించారు. వీటి ద్వారా 8680 ఉద్యోగాలు యువతకు లభించాయి. మరో రూ.900 కోట్ల పెట్టుబడులతో ఎనిమిది పరిశ్రమల నిర్మాణానికి భూమి పూజ చేశారు. వీటి ద్వారా మరో 2760 ఉద్యోగాలు జిల్లాకు రానున్నాయి. వీటికి భూముల కేటాయింపు, ఇతరత్రా అనుమతుల ప్రక్రియ గత ప్రభుత్వ హయాంలోనే మొదలు కావడం వల్ల వాటిని పరిగణనలోకి తీసుకోకపోయినా సీఎం చంద్రబాబు ప్రత్యేక చొరవతో కొత్తగా రూ.1213 కోట్ల పెట్టుబడులతో ఐదు పరిశ్రమల స్థాపనకు ఒప్పందాలు కుదుర్చుకోవడం మాత్రం కూటమి ప్రభుత్వ పాలనలో జిల్లాకు ఒనగూరిన తొలి ప్రయోజనంగా భావించాల్సి వుంది. నిజానికి ఈ ఒప్పందాలు కుదుర్చుకున్నప్పటికి కూటమి ప్రభుత్వం ఏర్పడి 69 రోజులు మాత్రమే గడిచింది. ఆ స్వల్ప వ్యవధిలోనే జిల్లాకు భారీగా ప్రయోజనాలు కలిగించడంలో సీఎం చంద్రబాబు సఫలీకృతులయ్యారు.



ఆగస్టు 19వ తేదీన శ్రీసిటీలో పరిశ్రమల ఏర్పాటుపై ఒప్పందం కుదుర్చుకుంటున్న సీఎం చంద్రబాబు

**ఎంవోయూలు కుదుర్చుకున్న పరిశ్రమలు**

| పరిశ్రమ | దేశం | పెట్టుబడి | ఉద్యోగాలు |
|---|---|---|---|
| ఆర్మ్‌వెస్ట్ మిరైటెక్ ఇండియా | సింగపూర్ | రూ. 40 కోట్లు | 500 |
| ఎక్సెలెంట్ ఫార్మా | ఇండియా | రూ. 150 కోట్లు | 500 |
| క్యాప్‌మ్యాన్ ఇండియా | యూఏఈ | రూ. 20 కోట్లు | 50 |
| డైకిన్ | జపాన్ | రూ. 1000 కోట్లు | 3000 |
| ప్రెస్టీజ్ ఇంటర్నేషనల్ | జపాన్ | రూ. 3 కోట్లు | 10 |
| మొత్తం | | రూ. 1213 కోట్లు | 4060 |

## 2.71 లక్షల మందికి పింఛను పెంపు



జిల్లావ్యాప్తంగా 2.71 లక్షల మంది పేద వృద్ధులు, వితంతువులు, వికలాంగులు ప్రభుత్వం నుంచీ సామాజిక భద్రతా పెన్షన్లు పొందుతున్నారు.2014కు ముందు వీరికి నెలవారీ కేవలం రూ.200 మాత్రమే పెన్షన్ వచ్చేది. 2014లో చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే పెన్షన్ మొత్తాన్ని ఒకేసారి రూ.2 వేలకు పెంచారు. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం తొలి ఏడాది మినహాయించి తదుపరి నాలుగేళ్లలో ఏడాదికి రూ. 250 చొప్పున పెంచుతూ వచ్చి.. ఎన్నికల ఏడాదిలో రూ.3 వేలు చేసింది. ఇటీవలి ఎన్నికల్లో చంద్రబాబు తమ ప్రభుత్వం ఏర్పడితే నెలవారీ పెన్షన్‌ను రూ.4 వేలకు పెంచుతామని హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో ఆయన సీఎం హోదాలో తొలి సంతకం పెన్షన్ పెంపు ఫైల్‌పై చేశారు. దీనివల్ల జిల్లాలోని 2.71 లక్షల మంది పేద లబ్ధిదారులకు నెలకు రూ.27.41 కోట్ల చొప్పున అదనపు లబ్ధి కలుగుతోంది. తొలి వందరోజులను పరిగణనలోకి తీసుకుంటే కూటమి ప్రభుత్వ ఏర్పాటు కారణంగా 2.71 లక్షల మందికి మూడు నెలల్లో రూ. 82.23 కోట్లు అదనంగా లబ్ధి చేకూరింది.

## పీహెచ్‌సీల్లో ఆగిన ఓపీ



ఉదయం 9 గంటలకు మూసి ఉన్న అత్తివరం పీహెచ్‌సీ

నాయుడుపేట, సెప్టెంబరు 18: జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (పీహెచ్‌సీ) బుధవారం ఓపీ సేవలు ఆగాయి. కొన్ని రోజులుగా వైద్యులు చేపట్టిన ఆందోళనలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో రోగులు ఇబ్బంది పడ్డారు. పలువురు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లారు. ప్రభుత్వ వైద్యుల పోస్టు గ్రాడ్యుయేషన్ ప్రవేశాలకు ఇస్తున్న రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కుదిస్తూ జీవో జారీ చేసింది. దీనికి నిరసనగా ఆందోళనకు దిగిన వైద్యులు బుధవారం ఓపీ సేవలను నిలిపివేశారు.



గరుడ వాహనంపై మలయప్పస్వామిని దర్శించుకోవడానికి తరలి వచ్చిన భక్తజనం



# తిరుమలలో మాదిరి గరుడసేవ

తిరుమల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో అక్టోబరు 4 నుంచి జరిగే శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో పౌర్ణమి సందర్భంగా బుధవారం సాయంత్రం మాదిరి గరుడ సేవ నిర్వహించారు. ప్రతి నెలా పౌర్ణమి రోజున మలయప్పస్వామికి గరుడ సేవ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఏటా బ్రహ్మోత్సవాలకు ముందు పౌర్ణమి రోజున మాదిరి గరుడ సేవ నిర్వహించడం పరిపాటి. తద్వారా బ్రహ్మోత్సవ ఏర్పాట్లను అధికారులు సమీక్షించుకుంటారు. ఇందులో భాగంగా బుధవారం సాయంత్రం 7 నుంచి రాత్రి 9 గంటల వరకు జరిగిన గరుడసేవలో టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్వో శ్రీధర్ కలిసి నాలుగు మాడవీధుల్లో భద్రత, తాగునీరు పంపిణీ, అన్నప్రసాదాల వితరణ, శ్రీవారిసేవకుల సేవలు, ప్రవేశ నిష్క్రమణ మార్గాలు, ఇతర ఇంజినీరింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. గరుడ వాహనం ముందు గజరాజులు ఠీవిగా నడుస్తుండగా, భజనబృందాలు ప్రదర్శనలు, మంగళవాయిద్యాలు నడుమ పౌర్ణమి గరుడసేవ కన్నుల పండువ గా జరిగింది. గరుడ వాహనసేవలో భక్తులు భారీగా పాల్గొని కర్పూర హారతులు పడుతూ గోవిందనామస్మరణలతో స్వామిని దర్శించుకున్నారు.



వాహన సేవ సందర్భంగా సూచనలు చేస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు



హారతులిస్తున్న భక్తులు

## సీఎం సహాయనిధికి రూ.84.50 లక్షలు



మెగా చెక్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ

తిరుపతి(విద్య), సెప్టెంబరు 18: విజయవాడ వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి జిల్లా నుంచి రూ.84,50,193 అందించినట్టు కలెక్టర్ వెంకటేశ్వర్ వెల్లడించారు. ఈ మెగా చెక్కును బుధవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించి.. మీడియాతో మాట్లాడారు. తన జీతంలో సగాన్ని విరాళంగా అందించానన్నారు. ఉద్యోగులు ఒకరోజు వేతనాన్ని ఇచ్చారని, మళ్లీ అన్ని ప్రభుత్వ శాఖలు విడివిడిగానూ విరాళాలు ఇచ్చినట్లు వివరించారు. జిల్లాలోని శ్రీసిటీ, శ్రీకాళహస్తి ఎలక్ట్రోస్టీల్, అపోలో టైర్స్, ప్రైవేటు స్కూల్స్ ఎడిఫై, సాయి ఎడ్యుకేషనల్ సొసైటీ, వేదవ్యాస సమాజం, విశ్రాంత ఉద్యోగులు, వ్యక్తులు స్పందించి విరాళాలను అందజేశారన్నారు. ఇలా ఇప్పటి వరకు రూ.84,50,193 సీఎం సహాయ నిధికి అందినట్లు చెప్పారు. ఇందులో ఇప్పటికే రూ.24,30,500 విలువజేసే వాటర్ బాటిళ్లు, టెట్రా పాలప్యాకెట్లు, బిస్కెట్లు, క్యాండిల్స్, అగ్గిపెట్టెలు తదితరాలను రెండు వారాలముందే పంపించామన్నారు. ఇక నారాయణ విద్యాసంస్థల నుంచి రూ.27 లక్షలతో పాటు మరో రూ.33 లక్షలు ఈరోజు సీఎం సహాయ నిధికి జమ చేయనున్నట్టు వెల్లడించారు. విరాళదాతలకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. డీపీఆర్వో బాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

### విరివిగా సాయం అందించండి

దాతలు మరింత విరివిగా సాయం అందించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. చెక్కు లేదా అకౌంట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా విరాళాలను ముఖ్యమంత్రి సహాయనిధికి పంపిస్తామని చెప్పారు. జిల్లా కలెక్టర్ తిరుపతి.. సీఎంఆర్ఎఫ్ పేరున ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0823066, అకౌంట్ నంబరు 230612010000689కు విరాళాలను పంపాలని దాతలకు సూచించారు.



నాయకులు, ప్రజలు, వివిధ సంస్థల నిర్వాహకులు అందించిన రూ.6,38,435 చెక్కును బుధవారం విజయవాడలో మంత్రి నారా లోకేశ్‌కు అందిస్తున్న గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్



సుధా సోమెనీ సిరామిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వాహకులు అందించిన రూ.5 లక్షల చెక్కును మంత్రి లోకేశ్‌కు ఇస్తున్న శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

## నారాయణ విద్యార్థుల విరాళం రూ.27,01,760



చెక్‌ను కలెక్టర్‌కు అందజేస్తున్న కొండలరావు, విద్యార్థులు

తిరుపతి(విద్య), సెప్టెంబరు 18: ఉమ్మడి చిత్తూరు జిల్లా నారాయణ విద్యా సంస్థల విద్యార్థులు ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.27,01,760 అందించారు. ఈ చెక్‌ను ఆ విద్యాసంస్థల డీజీఎం కొండలరావు బుధవారం కలెక్టర్ వెంకటేశ్వర్‌కు అందజేశారు. నారాయణ విద్యా సంస్థల తిరుపతి ఏజీఎం డాక్టర్ ఎ.శ్రీనివాసులు, ఎగ్జిక్యూటివ్ డీన్ ఏఎస్ రావు, ఇతర డీన్లు, ఏజీఎంలు, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

## పల్లికొండేశ్వరాలయంలో కట్ చేసిన క్యూలైన్ల ఏర్పాటు

- గుట్టు చప్పుడు కాకుండా పనులు చేయించిన వైసీపీ నేత

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

నాగలాపురం, సెప్టెంబరు 18: సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయంలో గత ఆదివారం ఆలయ మాజీ చైర్మన్, వైసీపీ నేత ఏవీఎం బాలాజీరెడ్డి కుమార్తె నిశ్చితార్థం సందర్భంగా స్టీల్ క్యూలైన్లను కట్ చేశారు. దాతల సాయంతో ప్రదోష మండపం వద్ద ఈ క్యూలైన్లను ఏర్పాటు చేశారు. నిశ్చితార్థ వేడుకలు బంధుమిత్రులకు కనిపించేందుకని వీటిని తొలగించారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు వెలువడటంతో ఆయన ఉలిక్కి పడ్డారు. తమిళనాడు నుంచి వెల్డర్లను పిలిపించి బుధవారం మధ్యాహ్నం ఆలయానికి పంపి క్యూలైన్లను అదే స్థానంలో యథావిధిగా పెట్టి వెల్డింగ్ చేయించారు. గుట్టు చప్పుడు కాకుండా ఈ పనులు పూర్తి చేశారు.



## ఎస్ఎస్ పురం ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

నాగలాపురం, సెప్టెంబరు 18: రూ.వంద ఇస్తేనే మస్టర్ వేస్తానంటూ ఉపాధికూలీల వద్ద డబ్బు డిమాండు చేసిన ఉపాధి హామీ పథక క్షేత్ర సహాయకుడు మాధవ్‌పై అధికారులు విచారించారు. నాగలాపురం మండలం ఎస్ఎస్‌పురానికి చెందిన ఈయన కూలీల వద్ద డబ్బులు డిమాండ్ చేస్తున్న వీడియో ఆధారంగా బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. కలెక్టర్ ఆదేశాల మేరకు దీనిపై ఎంపీడీవో బాబు, ఏపీవో సుధాకర్, పంచాయతీ కార్యదర్శి రోజా విచారణ జరిపారు. కలెక్టర్‌కు నివేదిక అందిస్తున్నామని చెప్పారు.

## బంగారుపాళ్యంలో నేడు, రేపు మంత్రి లోకేశ్ పర్యటన

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 18: రాష్ట్ర నారా లోకేష్ గురు, శుక్రవారాల్లో చిత్తూరు జిల్లాలో పర్యటిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. గురువారం సాయంత్రం తిరుపతి విమానాశ్రయం నుంచి బయల్దేరి రాత్రి 8.30 గంటలకు బంగారుపాళ్యం చేరుకుని బస చేస్తారు. శుక్రవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు కిడ్నీ డయాలసిస్ యూనిట్‌ను ప్రారంభిస్తారు. 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అక్కడ ప్రజా వేదిక కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం రెండు గంటలకు బంగారుపాళ్యం నుంచి రోడ్డుమార్గాన తిరుపతి విమానాశ్రయానికి చేరుకుంటారని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ముగిసిన అమ్మవారి పవిత్రోత్సవాలు

తిరుచానూరు, సెప్టెంబరు 18: తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో మూడు రోజులపాటు జరిగిన పవిత్రోత్సవాలు బుధవారం మహా పూర్ణాహుతితో ముగిశాయి.మధ్యాహ్నం మహాపూర్ణాహుతి, శాంతిహోమం, కుంభప్రోక్షణ, నివేదన చేపట్టారు. సాయంత్రం వరకు శ్రీకృష్ణస్వామి ముఖ మండపంలో అమ్మవారితో పాటు శ్రీసుదర్శన చక్రత్తాళ్వార్‌కు స్నపన తిరుమంజనం నిర్వహించి, పద్మ పుష్కరిణిలో చక్రస్నానం చేపట్టారు. రాత్రి శ్రీకృష్ణస్వామి, సుందరరాజస్వామి, పద్మావతి అమ్మవారు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. టీటీడీ ఈవో శ్యామలరావు దంపతులు, జేఈవో గౌతమి, డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ కేపీ చంద్రశేఖర్, శేషగిరి అర్చకులు శ్రీనివాసాచార్యులు, బాబుస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, గణేష్, సుబాస్కరనాయుడు తదితరులు పాల్గొన్నారు.



యాగశాలలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు



పద్మసరోవరంలో చక్రత్తాళ్వార్‌ను మునక వేయిస్తున్న అర్చకులు

## శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.16 కోట్లు

తిరుమల, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.16 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయ వివరాలను టీటీడీ బుధవారం ఉదయం ప్రకటించింది. మంగళవారం 72,072 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు.30,384మంది తలనీలాలు సమర్పించారు.

## శ్రీవారిసేవలో ప్రముఖులు

తిరుమల, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, తెలంగాణ ఎంఎల్సీ భానుప్రసాద్‌రావు ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

## ఉత్సాహంగా వినాయక నిమజ్జనం


వినాయకునికి హారతులిస్తున్న నిర్వహిస్తున్న మహిళలు

పాకాల, సెప్టెంబరు 18: పాకాల సంతగేటు సమీపంలో బుధవారం వినాయక విగ్రహాన్ని ఘనంగా నిమజ్జనం చేశారు. చవితి రోజు నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిమజ్జనం సందర్భంగా ప్రత్యేక వాహనంలో విగ్రహాన్ని కొలువుదీర్చి వివిధ పుష్పాలతో అలంకరించారు. మంగళవాయిద్యాలు, కేరళ వాయిద్యాలు, డ్రమ్స్, డీజేతో యువత సందడి చేస్తూ స్వామివారిని ఊరేగించారు. మహిళలు హారతిలిచ్చారు. అనంతరం నేంద్రగుంట చెరువులో క్రేన్ సహాయంతో నిమజ్జనం చేశారు. వేలంలో స్వామివారి లడ్డూను అడుసుపల్లె దళితవాడకు చెందిన సత్రవాడ రాంకీ రూ.41,116లకు దక్కించుకున్నాడు. సిల్వర్ కాయిన్ రూ.4,700కు మునిరత్నం రెడ్డి, గోల్డ్ కాయిన్ రూ.10,116కు మురళి దక్కించుకున్నారు. కార్యక్రమంలో సంతగేటు యూత్, స్థానికులు పాల్గొన్నారు.

## విద్యాబోధనతోపాటు సామాజిక బాధ్యత


మాట్లాడుతున్న అపర్ణ

పాకాల, సెప్టెంబరు 18: పిల్లలకు చదువుతో పాటు సామాజిక బాధ్యతపై అవగాహన కల్పించాలని రాష్ట్ర సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ అధికారి అపర్ణ అన్నారు. దామలచెరువు జడ్పీ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రధానోపాధ్యాయులు స్కూల్ ప్రొఫైల్ తయారు చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు పాఠ్య ప్రణాళిక రూపొందించుకొని ఆధునిక టెక్నాలజీ వినియోగించుకొని సులభరీతిలో అర్థమయ్యే రీతిలో బోధించాలన్నారు. పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆమె వెంట జిల్లా అకడమిక్ అధికారి శివశంకరయ్య, అసిస్టెంట్ అకడమిక్ అధికారి మధు, ప్రధానోపాధ్యాయుడు నాగరాజ, రిసోర్స్ పర్సన్స్ రమేష్ నాయుడు, ప్రమీల, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## బోరుబావుల వద్ద కేబుల్స్ చోరీ

పాకాల, సెప్టెంబరు 18: దామలచెరువు పంచాయతీ మంగినాయనిపల్లె సబ్‌స్టేషన్ పరిధిలోని కుక్కలపల్లె రైల్వే గేట్ దగ్గర తూర్పు అడవి దారికి ఇరువైపులా వ్యవసాయ బోరుబావుల వద్ద బుధవారం రాత్రి కేబుల్ తీగలు గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. బుధవారం ఉదయం బోరు మోటార్లు వేయడానికి వెళ్లిన రైతులు కేబుల్ ఈవిషయాన్ని గుర్తించారు. మధుకు చెందిన రెండు బోర్ల వద్ద, మంగినాయనిపల్లెకు చెందిన రమేష్ రెండు బోర్లవద్ద, కుక్కలపల్లెకు చెందిన లత, మంగినాయనిపల్లెకు చెందిన నాగేంద్ర, విజయబాబు మరో 13 మందికి పైగా వ్యవసాయ బోర్ల కేబుల్ వైర్లు చోరీ అయ్యాయి. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## తండ్రిపై పోక్సో కేసు నమోదు

పాకాల, సెప్టెంబరు 18: కూతురిపట్ల అసభ్యంగా ప్రవర్తించిన తండ్రిపై పోక్సో చట్టం కింద బుధవారం పాకాల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. సీఐ మద్దయ్య ఆచారి తెలిపిన వివరాల మేరకు మండలంలోని ఓ దళితవాడకు చెందిన ఓ వ్యక్తి ఇటీవల ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో కూతురు (12) పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. బాధిత బాలిక తల్లికి ఈ అఘాయిత్యం గురించి చెప్పింది. దీంతో ఆమె కూతురితో కలిసి పాకాల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. నిందితుడిపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.



## టాస్క్‌ఫోర్సు డీఎస్పీ బాధ్యతల స్వీకారం


మురళీధర్

మంగళం, సెప్టెంబరు 18: తిరుపతి టాస్క్‌ఫోర్సు డీఎస్పీగా మురళీధర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గతంలో ఇక్కడే పని చేస్తూ ఫిబ్రవరిలో ప్రొద్దుటూరు డీఎస్పీగా బదిలీ అయ్యారు. మరోసారి ఇక్కడికి బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం టాస్క్‌ఫోర్సు ఆర్ఎస్ఐలు, ఇతర సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు.

## చోరీ కేసులో ఏడాది జైలుశిక్ష

తిరుపతి(లీగల్), సెప్టెంబరు 18: తిరుపతి వెస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీకి పాల్పడిన ఇర్లానగర్‌కు చెందిన బి.రాజేష్‌కు ఏడాది జైలుశిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వాణిశ్రీ బుధవారం తీర్పు చెప్పారు. 2021 ఆగస్టు 15న రాజేష్ తిరుపతి ఇర్లానగర్‌లోని ఓ ఇంటి కిటికీ తొలగించి బంగారు, వెండి నగలతో పాటు నగదు దోచుకెళ్లాడు. బాధితురాలు సునీత ఫిర్యాదు మేరకు తిరుపతి వెస్ట్ పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడిని పట్టుకుని కోర్టులో హాజరుపరిచారు. నేరం నిరూపణ కావడంతో ఈ మేరకు శిక్ష విధించారు.

# మూగజీవాల సేవలో 67 వసంతాలు

### నేడు వెటర్నరీ కళాశాల వార్షికోత్సవం



తిరుపతిరూరల్, సెప్టెంబరు 18: తిరుపతి కేంద్రంగా 1957లో ఏర్పాటైన ఎస్వీ వెటర్నరీ కళాశాల 67 సంవత్సరలుగా మూగజీవాల సేవలో తరిస్తోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1955లో బాపట్లలోని వ్యవసాయ కళాశాల ప్రాంగణంలో ఆంధ్రా వర్సిటీకి(యానిమల్ హజబెండరీ విభాగం) అనుబంధంగా ఏర్పాటు చేసిన ఈ కళాశాలను రెండేళ్ల తర్వాత తిరుపతికి మార్పు చేశారు. తొలినాళ్లలో ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని మొదటి అంతస్తులో నిర్వహించారు. తర్వాత పూర్తి స్థాయిలో శాశ్వత కళాశాల, క్లినికల్, వసతి గృహ భవనాలను ఏర్పాటు చేయగా 2005నుంచి ఎస్వీ వెటర్నరీ వర్సిటీకి అనుబంధంగా నడుస్తోంది. పశువైద్య విద్యలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొంది, అనేక అవార్డులు సొంతం చేసుకుంది. వెటర్నరీ కళాశాల ఆడిటోరియంలో గురువారం మధ్యాహ్నం 3.30 గంటలకు జరిగే 61వ కాలేజ్ డేని పురస్కరించుకుని కళాశాలను అందంగా ముస్తాబు చేశారు.

**● యూజీలో 4,144మంది, పీజీలో 1,015మంది డిగ్రీలు**

ఈ కళాశాలలో ఇప్పటివరకు యూజీ(బీవీఎస్సీ) కోర్సుల్లో 4,144మంది, పీజీ(ఎంవీఎస్సీ)లో 1,015మంది, పీహెచ్‌డీలో 159మంది డిగ్రీలు పొందారు. ఈ విద్యా సంవత్సరం 472మంది యూజీ విద్యార్థులు, 80మంది పీజీ, పీహెచ్‌డీ విద్యను అభ్యసిస్తున్నారు. అనాటమీ, పాథాలజీ మ్యూజియంలు, ఐవీఎఫ్ ప్రయోగశాల వంటివి ప్రత్యేక గుర్తింపు సంతరించుకున్నాయి. దేశవాళీ ఆవు దూడలను పిండోత్పత్తి విధానంలో పుట్టించడం, సమీకృత దాణా తయారీ కేంద్రం, ఆధునిక పౌల్ట్రీ, పందుల పెంపక కేంద్రం, పశు ఉత్పత్తుల తయారీ, విక్రయశాల, ఆహార పరీక్షా కేంద్రం, ఆధునిక జంతువధ శాలలు సాంకేతిక విధానంలో నిర్వహిస్తూ విద్యాభివృద్ధికి విశేష కృషి చేస్తోంది.

**● నేటి వార్షికోత్సవానికి ఏర్పాట్లు పూర్తి**

61వ వార్షికోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. అనంత్య-2కే24'పేరిట ఈ కాలేజ్‌డే సెలబ్రేషన్స్ నిర్వహిస్తున్నాం. ముఖ్య అతిథిగా ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ డాక్టర్ జేవీరమణ, ప్రత్యేక అతిథిగా వేలూరు ఫారెస్ట్ డివిజన్ జిల్లా అధికారి డాక్టర్ డి.గురుస్వామి హాజరుకానున్నారు.

- డాక్టర్ జగపతిరామయ్య, అసోసియేట్ డీన్

### ఆకట్టుకున్న ఎథినిక్‌డే



తిరుపతిరూరల్, సెప్టెంబరు 18: ఎస్వీ వెటర్నరీ కళాశాల 61వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం నిర్వహించిన ఎథినిక్‌డే ఆకట్టుకుంది. ఇందులో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. క్రీడా, సాంస్కృతిక పోటీలలో విజేతలకు వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ శ్రీలత, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.జగపతిరామయ్య కలసి బహుమతులు ప్రదానం చేశారు. ఫిజియాలజీ హెడ్ డాక్టర్ బి.రాంబాబునాయక్, అధ్యాపకులు పాల్గొన్నారు.

# భాకరాపేటలో వైసీపీ కార్యాలయంపై దాడి

### మద్యం మత్తులో యువకుల వీరంగం ● స్టేషన్‌లో పోలీసుపైనా దాడి.. ఫర్నిచర్ ధ్వంసం

### ● అద్దం పగులగొట్టే క్రమంలో నిందితుడికి గాయం

తిరుపతి,సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేటలోని వైసీపీ కార్యాలయంపై మద్యం మత్తులో యువకులు దాడికి పాల్పడ్డారు. వీరు టీడీపీకి చెందినవారని అంటున్నారు. మంగళవారం రాత్రి ఈ ఘటన జరిగింది. వివరాలిలా ఉన్నాయి. భాకరాపేట చెక్‌పోస్టు సమీపంలో మెయిన్ రోడ్డులోని వైసీపీ కార్యాలయంపై మంగళవారం సాయంత్రం 6గంటల సమయంలో ముగ్గురు యువకులు మద్యం మత్తులో దాడి చేశారు. బోర్డుతో పాటు లోపలున్న సోఫాలు, కంప్యూటర్, కుర్చీలు ధ్వంసం చేశారు. దీనిపై వైసీపీ వర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. సమాచారం తెలుసుకుని పోలీసులే వచ్చి.. కార్యాలయ ఇన్‌చార్జిని విచారించారు. దాడికి పాల్పడిన స్థానిక యువకులను రాత్రి8 గంటల సమయంలో అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ ముగ్గురిలో ఒకరు పోలీసులపై తిరగబడి ఇద్దరు కానిస్టేబుళ్లపై దాడికి పాల్పడ్డాడు. పోలీస్ స్టేషన్‌లోని ఫర్నిచర్‌నూ ధ్వంసం చేశాడు. స్టేషన్‌లో ఫైళ్లు ఉంచే షెల్ఫ్‌కు బిగించిన అద్దాన్ని పగలగొట్టే క్రమంలో అతడి చేయి తెగి గాయమైంది. తీవ్ర రక్తస్రావం అవుతుండడంతో పోలీసులు అతన్ని ఆస్పత్రికి తరలించేందుకు యత్నించగా మద్యం మత్తులో ఉన్న అతడు తీవ్రంగా ప్రతిఘటించాడు. దీంతో నలుగురు కానిస్టేబుళ్లు అతడిని బలవంతంగా 108 అంబులెన్సులో ఆస్పత్రికి తరలించారు. వైసీపీ కార్యాలయం వెనుక వైపు నిందితుడికి చికెన్ షాపు వుందని, కొంతకాలంగా కార్యాలయాన్ని అక్కడి నుంచీ ఎత్తివేయాలని గొడవ చేస్తున్నట్లు తెలిసింది. ఇతడిపై గతంలో రెండు కేసులు నమోదయ్యాయని సమాచారం. వైసీపీ కార్యాలయంపై దాడికి సంబంధించి ఆ పార్టీ వర్గీయులు పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడంతో ఆ ఘటనపై కేసు నమోదు కాలేదు. దీనిపై చంద్రగిరి డీఎస్పీ నరసింగప్పను వివరణ కోరగా.. భాకరాపేటకు చెందిన తులసిరామ్, అతడి మిత్రుడు రాజశేఖర్ శనివారం వైసీపీ కార్యాలయం మీద దాడి చేసి బోర్డు, ఫర్నిచర్ ధ్వంసం చేశారని, సమాచారం తెలుసుకుని వెళ్ళిన పోలీసులపై తిరగబడ్డారని, స్టేషన్‌లో కూడా పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని చెప్పారు. విధులకు ఆటంకం కలిగించే విధంగా ప్రవర్తించినందుకు సెక్షన్ 353 కింద తులసిరామ్ రాయల్, యశ్వంత్ మీద కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

## గరుడసేవ ఏర్పాట్లపై అదనపు ఈవో సమీక్ష



తిరుమల, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు రెండు వారాల సమయం మాత్రమే ఉన్న క్రమంలో అక్టోబరు 8న జరిగే గరుడవాహన ఏర్పాట్లను టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి సమీక్షించారు. గోకులం విశ్రాంతి భవనంలో బుధవారం వివిధ విభాగాల అధికారులతో ఆయన చర్చించారు. గ్యాలరీల్లోకి ప్రవేశం, నిష్క్రమణ, హోల్డింగ్ పాయింట్లు, అన్నప్రసాద వితరణ, యాత్రికుల రద్దీ నిర్వహణ, పోలీసుల భద్రత, శ్రీవారి సేవకులు సేవలు, అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచడం, భక్తుల రవాణా, పార్కింగ్, బారికేడింగ్ తదితర అంశాలపై సుదీర్ఘంగా సమీక్షించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. మెరుగైన సమాచారం కోసం విస్తృత ఏర్పాట్లు చేయాలన్నారు. ఉత్సవ రోజుల్లో వయోవృద్ధులు దివ్యాంగులు, చిన్నపిల్లల తల్లిదండ్రులతో సహా అన్ని ప్రత్యేక ప్రవేశ దర్శనాలను రద్దు చేయడంతో పాటు అన్ని ఆర్జితసేవలను టీటీడీ రద్దు చేసిందని తెలిపారు. అక్టోబరు 7వ తేదీ రాత్రి 9 నుంచి అక్టోబరు 9వ తేదీ ఉదయం 6 గంటల వరకు ద్విచక్రవాహనాల రాకపోకలను నిషేధించినట్లు తెలిపారు. సమావేశంలో టీటీడీ సీఈ సత్యనారాయణ, తిరుమలలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వైభవంగా కల్యాణ వెంకన్న గరుడోత్సవం




చంద్రగిరి, సెప్టెంబరు 18: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం రాత్రి గరుడోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తిని పట్టు పీతాంబురాలు, బంగారు ఆభరణాలతో విశేషంగా అలంకరించారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన గరుడ వాహనంపై అధిష్ఠించారు. ఆలయ మాడ వీధుల్లో గోవింద నామస్మరణల నడుమ భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, రమేష్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, అర్చకులు బాలాజిరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణచార్యులు, పార్థసారిధి, జమేధర్ చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

## వేలం పాట ద్వారా రూ.4.96 లక్షల ఆదాయం

చంద్రగిరి, సెప్టెంబరు 18: చంద్రగిరిలోని మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో వివిధ వేలం పాటల ద్వారా రూ.4.96 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో పుట్టా రామకృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం ఆలయ ఆవరణలో ఈనెల 19 నుంచి ఏడాదిపాటు పూజా సామాగ్రి విక్రయించుకునేందుకు రూ.2.80 లక్షలు, అమ్మవారి వస్త్రాల సేకరణకు రూ.1.05లక్షలు, కొబ్బరి చిప్పలు సేకరణకు రూ.1.11లక్షలు వేలం పాట దక్కించుకున్నారు. తలనీలాల సేకరణకు ఎవరూ పాల్గొనకపోవడంతో వేలం వాయిదా వేశారు. ఈవేలం పాటలో దేవదాయధర్మదాయశాఖ తిరుపతి డివిజన తనిఖీ అధికారి పాల్గొన్నారు.

## వైభవంగా కాళీ, కాలభైరవుల కల్యాణం


కాళీ, కాలభైరవుల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

రామచంద్రాపురం, సెప్టెంబరు 18: రాయలచెరువుకట్ట శ్రీశక్తి పీఠంలో పౌర్ణమి సందర్భంగా కాళీ, కాలభైరవుల కల్యాణం బుధవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా పీఠంలో మరకతశక్తి కాళీ అమ్మవారితో పాటు ప్రత్యుంజర, శ్వేతవారాహి అమ్మవారికి తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. ఉదయం వేదపండితులు చండీహోమం ప్రారంభించగా మధ్యాహ్నం 12గంటలకు కుర్తాళం పీఠాధిపతి సిద్దేశ్వరానందభారతి, శక్తి పీఠాధీశ్వరి రమ్యానందభారతి స్వామి పూర్ణాహుతితో ముగించారు. 500 కేజీల అన్నప్రాసిని శక్తికాళీ అమ్మవారి ముందు ఏ ర్పాటు చేసి నైవేద్యం సమర్పించారు. వేదమంత్రోచ్చరణల మధ్య కాళీ, కాలభైరవులకల్యాణం నిర్వహించారు.

## ఉపాధ్యాయుడి సస్పెన్షన్

రేణిగుంట, సెప్టెంబరు 18: విద్యార్థినుల పట్ల ఓ ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తించడంతో విద్యాశాఖ అధికారి సదరు టీచర్‌ను సస్పెండ్ చేశాడు. డీవైఈవో బాలాజీ తెలిపిన వివరాల మేరకు.. రేణిగుంట మండలం ఆర్‌మల్లవరం జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఇద్దరు విద్యార్థినిల పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు వారు తెలిపారు. దీంతో వారు హెచ్‌ఎంకు ఫిర్యాదు చేశారు. జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లగా బుధవారం డీఈవో శేఖర్, డీవైఈవో బాలాజీ, ఎంఈవోలు ఇంద్రాదేవి, రంగనాథయ్య విచారణ చేపట్టారు. విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుడు రవిని వేర్వేరుగా విచారించారు. ఈ విచారణలో ఉపాధ్యాయుడు తప్పు చేశాడని నిర్ధారణ కావడంతో ఆయన్ను సస్పెండ్ చేస్తూ డీఈవో శేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే పాఠశాలలోని కొంత మంది ఉపాధ్యాయులు తనపై కుట్ర పన్ని ఇరికించారని ఉపాధ్యాయుడు రవి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## జనసేన నాయకుడికి ఎమ్మెల్యే పరామర్శ

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 18: శెట్టిపల్లెకు చెందిన జనసేన నాయకుడు చరణ్‌ను బుధవారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పరామర్శించారు. నాలుగు రోజుల క్రితం చరణ్ ఇంటిపై అర్ధరాత్రి రాళ్ల దాడి జరిగిన విషయం విదితమే. దాడిలో గాయపడి ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న చరణ్‌ను అడిగి ఎమ్మెల్యే వివరాలు తెలుసుకున్నారు. గ్రామంలో ఆకతాయిల ఆగడాలు ఎక్కువయ్యాయని పలువులు మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పట్టణాధ్యక్షుడు రాజారెడ్డి పాల్గొన్నారు.

## వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ


సరుకులు పంపిణీ చేస్తున్న సొసైటీ ప్రతినిధులు

తిరుపతి అర్బన్, అక్టోబరు 18: విజయవాడ వరద బాధితులకు సోషల్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రతినిధులు బుధవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. విజయవాడలోని రాళ్లపల్లెవారిగూడెం, ఓగిరాల ప్రాంతాలవారికి 250(25రకాల సరుకులతో కూడిన) కిట్లను అందజేశారు. మెడికల్ కిట్లు అందజేశారు. యూఎస్ఏకు చెందిన ఏకం సంస్థ డైరెక్టర్స్ నాగశ్రీ, నీలిమరెడ్డి వీటిని సమకూర్చారు.సిర్డ్స్ సంస్థ కార్యదర్శి మరుపూరి శేఖర్, సభ్యులు పాల్గొన్నారు.

## యాదవులకే టీటీడీ చైర్మన్ పదవి కేటాయించాలి


నియామక పత్రాలు అందజేస్తున్న లక్ష్మయ్య

తిరుపతి (లీలామహల్), సెప్టెంబరు 18: టీటీడీ పాలకమండలి చైర్మన్ పదవిని యాదవులకే కేటాయించాలని అఖిల భారత యాదవ సంఘం జాతీయ అధ్యక్షుడు బుసగాని లక్ష్మయ్య డిమాండ్ చేశారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ వెంకటేశ్వరస్వామిని తొలిసారి దర్శనం చేసుకున్న భక్తుడు శరభ యాదవ్ విగ్రహాన్ని అలిపిరి వద్ద ఏర్పాటు చేయడానికి ఇటీవల గుంటూరులో జరిగిన అఖిల భారత యాదవ మహాసంఘం సభలో తీర్మానం చేసినట్లు తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన రవి యాదవ్, వెంకటేష్ యాదవ్, మణికంఠ, మేకల రవి యాదవ్, సురేష్ యాదవ్, గొల్లపల్లి వెంకట కృష్ణయ్య యాదవ్‌లకు రాష్ట్ర, జిల్లా స్థాయిలో కీలక పదవులు దక్కినట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు వాసుదేవయాదవ్ పాల్గొన్నారు.

## కళాకారులను ప్రోత్సహించండి


అన్నదానం చేస్తున్న నవీన్‌కుమార్‌రెడ్డి

తిరుపతి (జీవకోన), సెప్టెంబరు 18: జానపద వృత్తి కళాకారులను ప్రోత్సహించాలని బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి కోరారు. జానపద వృత్తి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో అలిపిరి వద్ద పౌర్ణమి గరుడ సేవ పర్వదినాల్లో అన్నదానం చేస్తున్నారు. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో నవీన్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. సంస్కృతి సంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు అందిస్తున్న కళాకారులకు సముచిత స్థానం కల్పించాల్సిన బాధ్యత టీటీడీపై ఉందన్నారు. జానపద వృత్తి కళాకారుల సంఘం జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు పులిమామిడి యాదగిరి, కళాకారులు పాల్గొన్నారు.

## ప్రతిభావంతులకు మంచి భవిష్యత్తు


విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

తిరుపతి (లీలామహల్), సెప్టెంబరు 18: ప్రతిభ కలిగిన వారికి క్రికెట్ రంగంలో మంచి భవిష్యత్తు అందించడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు ఏసీఏ స్టేట్ ఇన్‌ఫ్రా కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. బీసీసీఐ, ఎస్సీఏ, లెవెల్ వన్ కోచ్‌గా సేవలందించిన విజయ్‌కుమార్ ఏసీఏ స్టేట్ ఇన్‌ఫ్రా కమిటీ చైర్మన్, సౌత్‌జోన్ అకాడమీస్ కమిటీ కన్వీనర్‌గా, చిత్తూరు డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా ఎంపికైన నేపథ్యంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి క్రికెట్ క్రీడాకారులకు భవిష్యత్తు అందించాలనే ఉద్దేశంతో జిల్లాలో ఫ్రాన్సిస్ ద్వారా 40 టీములకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. తిరుపతిలో ఉమెన్స్ క్రికెట్ అకాడమీ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నట్లు తెలిపారు. క్రీడాకారులకు ఉపాధి అవకాశం కల్పిస్తూ త్వరలో కొన్ని పోస్టులు భర్తీ చేయనున్నట్లు చెప్పారు.



## నేను ఆటోవాడిని..!

కార్యకర్త కోసం ఎమ్మెల్యే పులివర్తి నాని సరదాగా కాసేపు ఆటో డ్రైవర్‌గా మారారు. తిరుపతి రూరల్ మండలం సాయి నగర్ పంచాయతీకి చెందిన టీడీపీ కార్యకర్త ప్రకాష్ ఆటో కొన్నారు. బుధవారం శ్రీనివాసమంగాపురం వచ్చిన ఎమ్మెల్యేకి తన ఆటోను చూపారు. ఆ ఆటోలో కార్యకర్తను కూర్చోబెట్టుకుని శ్రీనివాసమంగాపురం నుంచి తిరుపతి రూరల్‌లోని రఘునాథ రిసార్ట్స్ వరకు నాని ఆటో నడిపారు. తర్వాత ప్రకాష్‌కు రూ.500 బోణిగా ఇచ్చి అభినందించారు. ఆటోలో మండల పార్టీ అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి తదితరులు ప్రయాణించారు.

- చంద్రగిరి

## ఆంగ్ల భాషా పరిజ్ఞానం నేటి అవసరం


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న స్వామి సుకృతానంద మహారాజ్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 18: నేటి తరం ప్రపంచ విజ్ఞానాన్ని తెలుసుకోవాలంటే ఆంగ్ల భాషా పరిజ్ఞానం తప్పనిసరి అని రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి సుకృతానంద మహారాజ్ తెలిపారు. ఎస్వీయూకు చెందిన డాక్టర్ గోపాల్ రాసిన 'స్పోకెన్ ఇంగ్లిష్' పుస్తకాన్ని బుధవారం ఆయన ఆవిష్కరించారు. నిత్య వ్యవహారంలో ఉపయోగించే పదాలు, వాక్యాలను సరళంగా పుస్తకంగా అందించిన గోపాల్ అభినందనీయుడని అన్నారు. ఈ పుస్తకం ఆంగ్ల భాషా పరిజ్ఞానాన్ని పెంచుకునేందుకు ఉపయోగపడుతుందన్నారు. పుస్తక రచయిత గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# దారి చూపండి

**● చిత్తూరు-తచ్చూరు ఎక్స్‌ప్రెస్ హైవే భూ బాధితులు**

**● సర్వీస్ రోడ్డు కోసం నేడు చిత్తూరులో ధర్నా**

**● 22న వంటావార్పు**

**● సీపీఐ జాతీయ నేత నారాయణ రాక**


చిత్తూరు-తచ్చూరు ఎక్స్‌ప్రెస్ హైవేపై ధర్నా చేస్తున్నరైతులు

పిచ్చాటూరు, సెప్టెంబరు 18: చిత్తూరు - తచ్చూరు ఎక్స్‌ప్రెస్ హైవే కోసం భూములు ఇచ్చిన రైతాంగం నోట్లో మట్టి కొట్టేందుకు కేంద్ర ఉపరితల రవాణా శాఖ యత్నిస్తోందని సీపీఐ, రైతు సంఘం నేతలు పేర్కొన్నారు. మంగళవారం రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను సీపీఐ, రైతు సంఘం ప్రతినిధి వర్గం అడిగి తెలుసుకుంది. ఈ సందర్భంగా కారూర్, పాదిరి, బూచవానత్తం, అయనంబాకం, కాళికాపురం, దామరపాకం గ్రామాలకు చెందిన రైతులు మాట్లాడుతూ... సీపీఐ, రైతు సంఘం సహకారంతో తమ భూములకు పరిహారం ఎకరాకు రూ.8 లక్షల నుంచి 16 లక్షలకు పెంచుకో గలిగామన్నారు. అయితే రహదారి పూర్తి కావస్తున్నా ఎంవోయూకు విరుద్ధంగా సర్వీస్ రోడ్డు నిర్మించకపోవడం దుర్మార్గమన్నారు. అలాగే పలు చోట్ల రోడ్డుకిరువైపులా ఉన్న గ్రామాలకు, పొలాలకు సబ్‌వే ఏర్పాటులో పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. రైతాంగ సమస్యల పరిష్కారానికి బుధవారం చిత్తూరులో ధర్నా, అలాగే 22న రహదారిపైన వంటా వార్పు కార్యక్రమం చేపట్టబోతున్నామని సీపీఐ, రైతు సంఘ నాయకులు ప్రకటించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏ.రామానాయుడు, రైతు సంఘం నేత జనార్దన్, సీపీఐ జిల్లా నాయకులు చిన్నిరాజ్, మహేష్, గురుమూర్తి, చిరంజీవినాయుడు, కృష్ణారెడ్డి కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలలో సర్వదర్శనానికి 18 గంటలు


వైకుంఠం క్యూకాంప్లెక్స్ వద్ద భక్తుల రద్దీ

తిరుమల, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. నాలుగురోజులుగా శ్రీవారి ఆలయ ప్రాంతంతో పాటు మాడవీధులు, అఖిలాండం, లడ్డూ వితరణ కేంద్రం, అన్న ప్రసాద భవనం, ఆర్టీసీ బస్టాండ్, కాటేజీలు వంటి ప్రాంతాల్లో రద్దీ అధికంగా నెలకొంది. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ ఏటీసీ వరకు వ్యాపించింది. రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం, స్లాటెడ్ సర్వదర్శన భక్తులు కూడా భారీగా తిరుమలకు రావడంతో వైకుంఠం క్యూకాంప్లెక్స్ ప్రాంతం, ఎస్వీ గెస్ట్‌హౌస్, ఎంబీసీ ప్రాంతాలు కిటకిటలాడుతున్నాయి. కల్యాణ కట్టల్లోనూ భక్తుల సందడి నెలకొంది.

## గత టీటీడీ బోర్డు, అధికారులపై క్రిమినల్ కేసులు పెట్టాలి: బీజేపీ



తిరుమల, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఖజానాకు గండి కొట్టేలా గత ప్రభుత్వంలో నిర్ణయాలు తీసుకున్న అప్పటి బోర్డు, అధికారులపై క్రిమినల్ కేసులు పెట్టాలని బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి డిమాండు చేశారు. తిరుమల శ్రీవారి ఆయలం ముందు బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో టీటీడీలో జరిగిన అవినీతిపై స్టేట్ విజిలెన్స్ విభాగం మూడునెలలుగా విచారణ చేస్తోందన్నారు. స్వామి ఖజానాకు ఇబ్బంది కలిగేలా అనేక నిర్ణయాలను బోర్డులో తీసుకున్నారన్నారు. ఈ నిర్ణయాలను తీసుకున్న అప్పటి బోర్డు ఛైర్మన్, సభ్యులు, నాటి ఈవోపై చర్యలు తీసుకోవాలని ఇప్పటికే చాలాసార్లు కోరామన్నారు. ఈ అంశాన్ని వదిలేసి అధికారులపై ఒత్తిళ్లు తీసుకొస్తున్నారని తెలిసిందన్నారు. గత ఛైర్మన్, ఈవోకు కేవలం నోటీసులు ఇచ్చారే తప్ప విచారించలేదన్నారు. కింది స్థాయి అధికారులను ఒకలా, బోర్డు సభ్యులను, ఉన్నతాధికారులను మరోలా చూడడం భావ్యం కాదన్నారు. ఛైర్మన్, ఈవోపై చర్యలు తీసుకోకుంటే త్వరలో డీజీపీని కలుస్తామన్నారు. గత ప్రభుత్వం తిరుమలను రాజకీయ కేంద్రంగా, ధనార్జనక్షేత్రంగా మార్చేసిందని ఆరోపించారు. వందల కోట్ల రూపాయలు చేతులు మారాయన్నారు. ఇంజినీరింగ్ పనుల్లో అప్పటి ఛైర్మన్ 10 నుంచి 15 శాతం కమీషన్లు తీసుకున్నారనే ఫిర్యాదులున్నాయన్నారు.

## రేపు జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 18: జిల్లా పరిషత్ (జడ్పీ) స్టాండింగ్ కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు సీఈవో గ్లోరియా ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజున ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, సంబంధిత అధికారులంతా తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

## ఉమ్మడి జిల్లాలో 17 మంది వీఆర్వోల బదిలీలు

చిత్తూరు కలెక్టరేట్,సెప్టెంబర్ 18: ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి 17 మంది వీఆర్వోలను అంతర్ జిల్లాలకు బదిలీ చేస్తూ నోడల్ ఆఫీసర్ అయిన కలెక్టర్ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. చిత్తూరు జిల్లాలోని నగరి ఆర్డీవో కార్యాలయంలో పనిచేస్తున్న టి.ప్రదీప్, పులిచెర్ల నుంచి కె.మునిరత్నం, వి.ప్రశాంత్‌కుమార్, బి.మునిరాజ, సోమల నుంచి డి.శ్రీనివాసులు, ఐరాల నుంచి టి.జయబాల, కె.నాగరత్నం, రామకుప్పం నుంచి ఎం.శివనారాయణ,సదుంలో పనిచేస్తున్న సి.ఆంజనేయులును తిరుపతి జిల్లాకు బదిలీచేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. తిరుపతి జిల్లాలోని ఎర్రావారిపాళ్యం నుంచి ఎస్.మహబూబ్ బాషా, పుత్తూరు నుంచి డి.సుబ్రహ్మణ్యం, కె.విజయ్‌కుమార్, పాకాల మండలం నుంచి వి.వెంకటరాజేష్, జి.సుబ్రహ్మణ్యం, జి.హరికృష్ణ, తిరుపతి అర్బన్ నుంచి జి.కమల, వై.సుబ్రహ్మణ్యంలను చిత్తూరు జిల్లాకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

## పద్మావతి వర్సిటీలో క్యాంటీన్ ప్రారంభం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 18: పద్మావతి మహిళా యూనివర్సిటీలో ఎట్టకేలకు క్యాంటీన్ ప్రారంభమైంది. చాలా ఏళ్లుగా నిర్వహిస్తున్న క్యాంటీన్ కొన్ని కారణాలతో కొంతకాలంగా మూతపడింది. విద్యార్థులు, ఉద్యోగుల ఇబ్బందిని గుర్తించిన ఇన్‌చార్జి వీసీ ఉమ త్వరితగతిన క్యాంటీన్ నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు.

## మంత్రి లోకేశ్ పర్యటనకు భారీ బందోబస్తు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 18: చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో గురు, శుక్రవారాల్లో పర్యటనకుగాను మంత్రి నారా లోకేశ్ రేణిగుంట విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గాన వెళ్లనున్నారు. ఈ సందర్భంగా జిల్లా పరిధిలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. గురువారం సాయంత్రం 6.40 గంటలకు ఆయన రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని రోడ్డు మార్గాన బంగారుపాళ్యం బయలుదేరతారు. ఆయన బందోబస్తు కోసం ఇద్దరు ఏఎస్పీలు, ఇద్దరు డీఎస్పీలు, 10 మంది సీఐలు, 100 మంది బలగాలను నియమించారు. బైపాస్ రోడ్డులోనూ పోలీసులు, రిజర్వు, బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లు తనిఖీలు చేస్తున్నాయి. జిల్లా సరిహద్దు ప్రాంతం నేంద్రగుంట వరకు మంత్రికి భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి చెప్పారు.




సిద్ధమవుతున్న వాహనమండపం - వైభోత్సవ మండపం వద్ద విద్యుత్ కటౌట్ - ఆలయం వద్ద రంగవల్లులు

## వడివడిగా శ్రీవారి బ్రహ్మోత్సవ ఏర్పాట్లు

తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవ ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. అక్టోబరు 4 నుంచి 12వ తేదీ వరకు ఈ ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. నెలరోజుల క్రితమే మొదలైన ఏర్పాట్లు ప్రస్తుతం జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే విద్యుత్ లైట్లు, మాడవీధుల్లో గ్యాలరీలు, ఆలయం ముందు బారికేడ్ల అమరిక పనులు పూర్తయ్యాయి. ఆలయానికి రంగులు వేశారు. మాడవీధుల్లో రంగవల్లులు వేస్తున్నారు. వాహనసేవలు వీక్షించేందుకు వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా మొబైల్ టాయిలెట్లు, వివిధ దేవతామూర్తుల విద్యుత్ కటౌట్లు, స్వాగత తోరణాలు, వాహనాలపై ఉత్సవమూర్తులు స్పష్టంగా కనిపించేలా మాడవీధుల్లో మెటల్ హాలెడ్ లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. వాహనమండపాన్ని కూడా సర్వాంగసుందరంగా తీర్చిదిద్దుతున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

## పర్యాటక వీడియో, రీల్స్ పోటీలకు 24వ తేదీ గడువు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, పర్యాటక శాఖ అధికారులు

తిరుపతి(విద్య), సెప్టెంబరు 18: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా వీడియోలు, రీల్స్ పోటీలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ప్రాంతీయ పర్యాటక శాఖ అధికారి రమణప్రసాద్, జిల్లా పర్యాటకశాఖ అధికారి రూపేంద్రనాథ్‌రెడ్డితో కలిసి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. పోటీలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈనెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రాల సమాచారాన్ని పర్యాటకులకు తెలియజేస్తూ ఆకట్టుకునే విధంగా వీడియోలు, రీల్స్ రూపొందించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

● **మొదటి కేటగిరి:** తిరుమల వేంకటేశ్వరస్వామి, తిరుపతి గోవిందరాజస్వామి, తిరుచానూరు పద్మావతీ అమ్మవారు, అప్పలాయగుంట ప్రసన్న వెంకటేశ్వరస్వామి, గుడిమల్లం పరశురామేశ్వరస్వామి, శ్రీకాళహస్తి శ్రీకాళహస్తీశ్వరస్వామి, నారాయణవనం కల్యాణ వెంకటేశ్వరస్వామి, నాగలాపురం వేదనారాయణస్వామి, సురుటుపల్లి పల్లికొండేశ్వరస్వామి ఆలయాలపై ఒక నిమిషం నిడివితో వీడియో, 15 నుంచి 30 సెకన్ల నిడివితో రీల్ రూపొందించి సమర్పించాల్సి ఉంటుంది.

● **రెండవ కేటగిరి**

జిల్లాలోని ఎస్వీ జూలాజికల్ పార్క్, కళ్యాణీ డ్యామ్, చంద్రగిరి కోట, తలకోన జలపాతం, తలకోన, మామండూరు ఎకో టూరిజం, కైలాసనాథకోన జలపాతం, శ్రీసిటీ, తూపిలిపాళెం బీచ్, ఇరకం ఐలాండ్, పులికాట్ సరస్సు, నేలపట్టు పక్షుల అభయారణ్యంపై నిమిషం నిడివితో వీడియో, 15-30 సెకన్ల నిడివితో రీల్స్ రూపొందించాల్సి ఉంటుంది.

● **బహుమతులు**

మొదటి, రెండవ కేటగిరీల్లో ఒక్కో కేటగిరీలో అత్యుత్తమ వీడియో లేదా రీల్‌కు ప్రథమ బహుమతి రూ.లక్ష, ద్వితీయ బహుమతి రూ.50వేలు, తృతీయ బహుమతి రూ.25వేలు ఉంటుంది.

రీల్స్, వీడియోలను edtpt@aptdc.in లేదా collectortirupati@ap.gov.inలకు ఈనెల 24వ తేదీ లోపు మెయిల్ ద్వారా పంపాల్సి ఉంటుంది. ఇతర వివరాలకు tirupati.ap.gov.in వెబ్‌సైట్‌లో గాని, 6309942027, 9848823086, 9705933311లలో గాని సంప్రదించవచ్చు.

## ప్లాస్టిక్ గోడౌన్లపై కమిషనర్ దాడులు

● రూ.7లక్షలకు పైగా జరిమానా



తిరుపతి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ప్లాస్టిక్ కవర్ల గోడౌన్లపై మున్సిపల్ కమిషనర్ ఎన్.మౌర్య బుధవారం దాడులు చేశారు. పెద్దయెత్తున నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. రూ.7లక్షలకు పైగా జరిమానా విధించారు. ప్లాస్టిక్ రహిత నగరంగా తిరుపతిని తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని ఈ సందర్భంగా ఆమె కోరారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా ఈ తనిఖీలు నిర్వహించామని తెలిపారు. 120 మైక్రాన్ల కంటే ఎక్కువ ఉన్న ప్లాస్టిక్ కవర్లు, వస్తువులు వినియోగించరాదని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు, ప్లేట్లు, స్ట్రాస్, ప్యాకింగ్ కవర్స్ అమ్మితే దుకాణాల లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఎంహెచ్‌వో డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్వైజర్లు చెంచయ్య, సుమతి పాల్గొన్నారు.

## తడి, పొడిచెత్తను విడివిడిగా అందించాలి


అవగాహన కల్పిస్తున్న సెక్రటరీ బాబునాయుడు

తిరుపతిరూరల్, సెప్టెంబరు 18 : ప్రజలు తడి, పొడి చెత్తలను వేరుచేసి, సిబ్బందికి అందించాలని పంచాయతీ సెక్రటరీలు బాబునాయుడు, కరుణశ్రీ తెలిపారు. తిరుపతి రూరల్ మండలం పేరూరు, చెర్లోపల్లె, వెంకటపతినగర్, గాంధీపురం గ్రామ పంచాయతీ పరిధిలో బుధవారం సిబ్బందితో కలసి ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తవేయరాదని, నిబంధనలు అతిక్రమిస్తే జరిమానా విధిస్తామని తెలిపారు.

## కేబుల్స్‌తో ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడండి

తిరుపతి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో ప్రజలకు ఇబ్బంది లేకుండా కేబుల్స్‌ను నెల రోజుల్లో సరిచేయాలని కమిషనర్ ఎన్.మౌర్య కేబుల్ ఆపరేటర్లను ఆదేశించారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం కేబుల్ ఆపరేటర్స్, ఇంటర్నెట్ ప్రొవైడర్స్, ఎస్పీడీసీఎల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. నగరంలో కేబుల్స్ అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు. తద్వారా వాహన చోదకులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. ఎవ్వరికీ ఇబ్బంది కలగకుండా క్రమ పద్ధతిలో వైర్లను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. రోడ్డుకు మధ్య స్తంభాలకు ఉన్న కేబుల్ వైర్లను, ఫైబర్ వైర్లను నెల రోజులలోపు తొలగించాలన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు ఎస్ఈ మోహన్ పాల్గొన్నారు.

## 4న స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నిక

తిరుపతి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నిక అక్టోబర్ 4వ తేదీన నిర్వహించనున్నట్లు కమిషనర్ మౌర్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నిక ప్రక్రియకు గురువారం నోటీసు ప్రచురిస్తున్నామని పేర్కొన్నారు. ఎన్నికలలో పాల్గొనదలచిన కార్పొరేటర్లు తమ నామినేషన్ ఫామ్‌ను ఈ నెల 26వ తేదీ మధ్యాహ్నం 3 గంటలలోపు తనకు అందజేయాలని తెలిపారు. అర్హత సాధించిన నామినేషన్లను 27న ప్రకటిస్తామని, 30న విత్ డ్రా ఉంటుందని, అదే రోజు పోటీలో ఉన్న వారి పేర్లు ప్రకటిస్తామని వివరించారు. అక్టోబర్ 4న ఎన్నికలు నిర్వహించి, అదే రోజు విజేతలను ప్రకటిస్తామని తెలిపారు.

**IN THE COURT OF THE V-ADDITIONAL JUNIOR CIVIL JUDGE:TIRUPATI**
**O.S. No. 139 of 2019**

Bank of India, Main Branch,
rep. by Constituted Attorney Chief
Manager, Tirupati. ...Plaintiff

Vs.

Pamulapati Sivanarayana
Propritor M/s. Siva Down loads,Tirupati
...Defendant

**SUIT SUMMONS TO THE DEFENDANT**

To.
Pamulapati Sivanarayana
S/o. Pamulapati Gangaiah,
Propritor, M/s Siva Down Loads,residing at Door No. 19-9-25, Kennedy Nagar, Lakshmipuram, Tirupati - 517 501

Sir.

Please take Notice that the above Case stands posted to 26-9-2024 for your appearance. Do appear on that day and file your Objections if any at 10.30 a.m. in the above mentioned Court on 26-9-2024, else the matter will be decide ex-party.

**K. AJEYAKUMAR, Advocate,**
**Tirupati**

# పుత్తూరు వార్తలు

## పాము కాటుతో వివాహిత మృతి


రూపవతి (ఫైల్ ఫొటో)

పుత్తూరు, సెప్టెంబరు 18: విష సర్పం కాటేయడంతో వివాహిత మృతి చెందారు. పట్టణంలోని జెండామాను వీధి క్రాస్‌లో ఈ సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. స్థానిక ఓ ప్రైవేట్ పాఠశాలలో స్పెషల్ క్లాసులకు వెళ్లిన టెన్త్ చదివే కూతురు పరిణితను తీసుకు వచ్చేందుకు రూపవతి(39) వెళ్లింది. ఇంటికి వస్తుండగా దారిలో కాలిపై విష సర్పం కాటేసింది. కింద పడిన తల్లిని దారిన పోయే వారి సాయంతో ఆస్పత్రికి తీసుకెళ్లింది. పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి తీసుకెళ్లమని వైద్యులు సూచించారు. అయినప్పటికీ ఆమె మృతి చెందారు. కాగా రూపవతి, ఆమె భర్త ధనంజయులు తన ఇద్ద పిల్లలతో పాలమంగళం సమీపంలోని చెర్లోపల్లి నుంచి పిల్లల చదువుల కోసం పుత్తూరు వచ్చారు. జెండామాను వీధిలో గత కొంతకాలంగా వీధి దీపాలు వెలగడం లేదు. పాములు ఎక్కువగా సంచరిస్తున్నాయని మున్సిపాలిటీ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని స్థానికులు చెబుతన్నారు.

## అండర్ 14 బాల బాలికల జూడో జట్టు ఎంపిక



వడమాలపేట, సెప్టెంబర్ 18: గ్రామస్థాయిలో క్రీడలను ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని డీఈవో శేఖర్ చెప్పారు. బుధవారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో అండర్ 14 ఉమ్మడి చిత్తూరు జిల్లా జూడో బాల, బాలికల జిల్లా జట్టు ఎంపికలు నిర్వహించారు. ఈ పోటీలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా నలుమూలల నుంచి 200 మందికి పైగా క్రీడాకారులు హజరయ్యారు. తిరుపతి జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ బాబు ఎంపికలకు పర్యవేక్షించారు. బాలుర జట్టు... హేమసాయి, భాను ప్రసాద్(మంగళం), దిలీప్, గౌతమ్(రామకుప్పం), నాగరాజు(పల్లం), మణికంఠ, గంగాధర్(తిరుపతి), బాలికల జట్టు... లీల, వెన్నల (వడమాల పేట)అనూష, పూజిత(రేణిగుంట) భావన, పూజ(మంగళం), గీతిక (తిరుపతి). కార్యక్రమంలో పీడీలు జేమ్స్, సాంబశివరావు, జయప్రకాష్, శ్రీధర్, పుష్పవాణి, ప్రసన్నకుమారి, త్రిలోక సుందరి పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

పుత్తూరు అర్బన్, సెప్టెంబర్ 18: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతగా స్వీకరించాలని మున్సిపల్ టీపీవో మూర్తి పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు బుధవారం మున్సిపల్, సచివాలయం, పారిశుధ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్వేటినగరం రోడ్డులో మానవహారం నిర్వహించారు. చెత్త తొలగింపు సమయంలో పారిశుధ్య కార్మికులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

## నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు

● పోలీసులకు ఫిర్యాదు చేసిన టీడీపీ నాయకులు

పుత్తూరు అర్బన్, సెప్టెంబర్ 18: పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. ఉదయం 6 గంటలకే బార్‌ను తెరిచి మద్యం విక్రయిస్తుండటంపై టీడీపీ పట్టణ అధ్యక్షుడు జీవరత్నం నాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఏ1 బార్‌లో ఉదయం 6 గంటలకే మద్యం విక్రయిస్తున్న వీడియో ఆధారాలను అందజేశారు. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 11 గంటలకే తెరవాల్సిన దుకాణాలను తెల్లారక మునుపే తెరుస్తుండటం పరిసర ప్రాంతాల ప్రజలను అసౌకర్యానికి గురిచేస్తున్నారని పేర్కొన్నారు. ఏ1 బార్‌తో పాటు మద్యం విక్రయ దుకాణాలకు పోలీసులు హెచ్చరిక నోటీసులు జారీ చేశారు. ఏ1 బార్‌కు సంబంధించిన నిబంధనల అతిక్రమణపై ఎక్సైజ్ శాఖకు నివేదిస్తామన్నారు.

## రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు

● ప్రమాద ప్రాంతాల పరిశీలన


ప్రమాద ప్రాంతాల పరిశీలనలో అధికారులు

పుత్తూరు అర్బన్, సెప్టెంబర్ 18: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. పుత్తూరు - చెన్నై జాతీయ రహదారిలో ప్రమాదకర ప్రదేశాలను పోలీస్ శాఖ నుంచి డీఎస్పీ రవికుమార్, సీఐ సురేంద్ర నాయుడు, ఆర్టీఏ నుంచి ఎంవీఐ చంద్రశేఖర్, ఎన్‌హెచ్ నుంచి సూపర్‌వైజర్ నాగరాజు పరిశీలించారు. ప్రధానంగా పున్నమి కూడలి, గోవింద పాలెం, మరాట గేట్, వేపగుంటతో పాటు మరో మూడు ప్రమాద ప్రదేశాలుగా గుర్తించారు. ఈ ప్రాంతాల్లో నిరంతరంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతండటంతో వీటిని బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించారు. భవిష్యత్తులో ప్రమాదాలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ ప్రమాదకర ప్రదేశాల్లో రంబుల్ స్ట్రిప్స్, స్పీడ్ బ్రేకర్లు వంటివి ఏర్పాటుతో రోడ్డు ప్రమాదాలను నియంత్రనకు చొరవ తీసుకుంటామని అధికారులు తెలియజేశారు. పుత్తూరు నుంచి జాతీయ రహదారిని చేరుకునే క్రమంలో వాహనదారులకు ఈ ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు తరచుగా జరుగుతున్నాయని అధికారులు తెలిపారు.

## అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న

ఏర్పేడు, సెప్టెంబరు 18: అన్నిదానాల కన్నా అన్నదానం మిన్న అని దాతలు అన్నారు. మండలంలోని మర్రిమందలో కొలువైఉన్న లక్ష్మీ హయగ్రీవ ఆలయంలో భాద్రపద మాసం పౌర్ణమిని పురస్కరించుకుని భక్తులకు ఆలయ కమిటీ అన్నదానం చేసింది. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు గిరిప్రసాద్‌రెడ్డి, మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ పౌష్టికాహారం

కేవీబీపురం, సెప్టెంబరు 18: మండలంలో అర్హులైన బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని అంగన్‌వాడీలు అందించాలని ఎంపీడీవో రామచంద్ర చెప్పారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో సీడీపీవో దివ్య శోభారాణి ఆధ్వర్యంలో పౌష్టికాహార వారోత్సవాలను ప్రారంభించారు. ఎంఈవో లక్ష్మీపతి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## ప్రతిభావంతులకు మంచి భవిష్యత్తు


విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

తిరుపతి(లీలామహల్), సెప్టెంబరు 18: ప్రతిభ కలిగిన వారికి క్రికెట్ రంగంలో మంచి భవిష్యత్తు అందించడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు ఏసీఏ స్టేట్ ఇన్‌ఫ్రా కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. బీసీసీఐ, ఎన్సీఏ, లెవెల్ వన్ కోచ్‌గా సేవలందించిన విజయ్‌కుమార్ ఏసీఏ స్టేట్ ఇన్‌ఫ్రా కమిటీ చైర్మన్, సౌత్‌జోన్ అకాడమీస్ కమిటీ కన్వీనర్‌గా, చిత్తూరు డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా ఎంపికైన నేపథ్యంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. గ్రామస్థాయి నుంచి క్రికెట్ క్రీడాకారులకు భవిష్యత్తు అందించాలనే ఉద్దేశంతో జిల్లాలో ప్రాన్సిస్ ద్వారా 40 టీములకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. తిరుపతిలో ఉమెన్స్ క్రికెట్ అకాడమీ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నట్లు తెలిపారు. క్రీడాకారులకు ఉపాధి కల్పిస్తూ త్వరలో కొన్ని పోస్టులు భర్తీ చేయనున్నట్లు చెప్పారు.

## ఉపాధ్యాయ సంఘ మహాసభను విజయవంతం చేయండి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 18: ఏపీటీఎఫ్ మహాసభను విజయవంతం చేయాలని అర్బన్ అధ్యక్షురాలు పద్మావతి, ప్రధాన కార్యదర్శి సుకాంత్ కో రారు. పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో వారు మాట్లాడుతూ 22వ తేదీ ఆదివారం తిరుపతిలోని బాబూ జగ్జీవన్‌రాం భవన్‌లో ఉదయం 9గంటలకు సభ జరుగుతుందని తెలిపారు. విద్యావ్యవస్థలో సంస్కరణలు, భవిష్యత్తు కార్యాక్రమాలపై చర్చించనున్నట్టు తెలిపారు.

# గూడూరు

## సూళ్లూరుపేట/వెంకటగిరి

## రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఓజిలి, సెప్టెంబర్ 18: ఓజిలి మండలం పెద్దపరియ రైల్వేస్టేషన్ సమీపంలో రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి బుధవారం మృతి చెందినట్లు గూడూరు రైల్వే పోలీసులు తెలిపారు. సుమారు 35 ఏళ్ల వయస్సు ఉన్న వ్యక్తి రైలు పట్టాలపై మృతి చెంది ఉన్నట్లు స్టేషన్ మాస్టర్‌కు సమాచారం అందింది. రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఆస్పత్రికి తరలించారు.

## నెల్లూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా కాకాణి



నెల్లూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నెల్లూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నియమించారు. ఈ మేరకు వైసీపీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. బుధవారం సాయంత్రం తాడేపల్లిలో ఉమ్మడి నెల్లూరు జిల్లా వైసీపీ నాయకులతో జగన్ సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో కాకాణి మూడోసారి జిల్లా అధ్యక్ష బాధ్యతలు చేపట్టినట్లు అయింది.

## వెంకటేశ్వరస్వామి ఆలయ హుండీ చోరీ

డక్కిలి, సెప్టెంబరు 18: డక్కిలిలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీని పగల కొట్టి అందులోని నగదు ఎత్తుకెళ్లారు. డక్కిలిలోని జాతీయ రహదారికి ఆనుకొని వున్న ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగులు ప్రవేశించారు. హుండీని ఎత్తుకెళ్లి కొంతదూరంలో తాళం పగల కొట్టి అందులోని నగదు తీసుకెళ్లారు. ఉదయం నిర్వాహకులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. హుండీలో సుమారు రూ.1.50లక్షలు నగదు ఉంటుందని తెలిపారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్ఐ శివశంకర్ క్లూస్ టీంను పిలిపించి వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సీఎం సహాయనిధికి విరాళాలు


నెలవల సుబ్రహ్మణ్యానికి చెక్కును నాయకులు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 18: వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి సూళ్లూరుపేట, నాయుడుపేట రైసు మిల్లుల అసోసియేషన్ నాయకులు రూ.5 లక్షల చెక్కును టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యానికి అందజేశారు. అలాగే నాయుడుపేట ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ నాయకులు రూ.లక్ష చెక్కు అందజేశారు.

**గూడూరు:** విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి పలువురు దాతలు బుధవారం ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌కు చెక్కులు అందజేశారు. పట్టణానికి చెందిన సాయి రూ.10వేలు, చిల్లకూరు మండలం ఎగువరాజుపాళెం గ్రామానికి చెందిన శివశంకర్ రాజు రూ.5వేలు చెక్కులు అందజేశారు.

## ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

కోట, సెప్టెంబరు 18: మండల పరిధిలోని చిట్టేడులో పేకాట స్థావరంపై బుధవారం రాత్రి ఎస్ఐ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఐదుగురిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద రూ.41 వేల నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## బస్సు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

కోట, సెప్టెంబరు 18: కోట పట్టణ పరిధిలోని క్రాస్‌రోడ్డులో బుధవారం రాత్రి ఓ ప్రైవేట్ పరిశ్రమకు చెందిన బస్సు ఢీకొని తల్లం శ్రీనివాసులు అనే కార్పెంటర్ తీవ్రంగా గాయపడ్డాడు. క్రాస్‌రోడ్డులో నడుచుకుంటూ వెళ్తున్న శ్రీనివాసులును ఓ ప్రైవేట్ పరిశ్రమకు చెందిన బస్సు కార్మికులతో వాకాడు వైపు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ శ్రీనివాసులును స్థానికులు 108వాహనంలో కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

## అన్నదానం

గూడూరు అర్బన్, సెప్టెంబరు 18: మాజీ ఎంపీ వరప్రసాదరావు పుట్టిరోజు సందర్భంగా పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక టవర్‌క్లాక్ వద్ద మాజీ ఎంపీ కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. పేదలకు అన్నదానం చేశారు. ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, పాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వినేష్ యాదవ్, పురుషోత్తంరెడ్డి, బాలకృష్ణమ నాయుడు, దయాకర్, మన్నెం శీనయ్య, వెంకటేశ్వర్లు, రమణయ్య, లక్ష్మి, భవానీ, ప్రకాష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## మండల స్థాయి క్రీడా పోటీలు

గూడూరు అర్బన్, సెప్టెంబరు 18: స్థానిక ఏఆర్‌రెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఈనెల 20, 21వ తేదీల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండలస్థాయి క్రీడాపోటీలు, ఎంపికలు నిర్వహించనున్నట్లు ఎంఈవోలు సనత్‌కుమార్, కాంచన బుధవారం తెలిపారు. అథెలెటిక్స్, బ్యాడ్మింటన్, యోగా, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ అండర్-14, అండర్-17 విభాగాల్లో విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించనున్నారు.




తడ పీహెచ్‌సీలో వైద్యుడు రాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీ - నాయుడుపేటలోని తుమ్మూరు అర్బన్ పీహెచ్‌సీలో ఫార్మసిస్టు లేక మందులు ఇస్తున్న స్టాఫ్ నర్సు - ఓజిలి మండలంలోని అత్తివరం పీహెచ్‌సీలో సిబ్బంది రాకపోవడంతో నిరీక్షిస్తున్న రోగులు

# సమ్మెలోకి ప్రభుత్వ వైద్యులు

● ఓపీ సేవలు లేక రోగుల ఇబ్బందులు
● సిబ్బంది అరకొర సేవలు

నాయుడుపేట, సెప్టెంబరు 18: ప్రభుత్వ వైద్యులు సమ్మె చేస్తున్నారు... ఈ విషయం తెలియక వైద్యం కోసం ఆస్పత్రులకు వచ్చిన రోగులు ఉసూరుమంటూ వెనుదిరిగారు. ప్రభుత్వ వైద్యులకు పోస్టు గాడ్యుయేషన్ ప్రవేశాల్లో ఇస్తున్న రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కుదించింది. ఆ మేరకు రిజర్వేషన్ల కోటా తగ్గిస్తూ జీవో నెంబరు 85 విడుదల చేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వ వైద్యులు నిరసన తెలుపుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైద్యుల సంఘం పిలుపు మేరకు మంగళవారం నుంచి సమ్మెలోకి వెళ్లారు. ఇందులో భాగంగా బుధవారం అన్ని వైద్యశాలల్లో ఓపీ సేవలను సైతం నిలిపివేశారు. ఈ నేపథ్యంలో సూళ్లూరుపేట నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఉన్న పీహెచ్‌సీలను ఆంధ్రజ్యోతి విజిట్ చేసింది. ఈ సందర్భంగా ఆస్పత్రుల్లో వైద్యుల గదులన్నీ ఖాళీగా కనిపించాయి. కొన్నిచోట్ల డాక్టర్లు లేకపోవడంతో రోగులు నిరాశతో వెనుతిరిగి వెళ్లారు. కొన్నిచోట్ల సిబ్బందే రోగులకు మందులు అందించారు. అసలే సీజనల్ వ్యాధులతో ఇబ్బందులు జనం ప్రభుత్వ వైద్యులు సమ్మెలో ఉండటంతో ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్నారు.

**నాయుడుపేట:** తుమ్మూరు అర్బన్ పీహెచ్‌సీలో ఉదయం 9 గంటలకు ల్యాబ్ టెక్నీషియన్, స్టాఫ్ నర్సులు మాత్రమే వచ్చారు. డాక్టర్, ఫార్మసిస్టు లేకపోవడంతో స్టాఫ్ నర్సు రోగులను పరీక్షించి వారికి మందులు అందజేశారు.

**తడ:** స్థానిక పీహెచ్‌సీలో డాక్టరు రాకపోవడంతో అక్కడి సిబ్బందే రోగులకు వైద్యం అందించారు.

**ఓజిలి:** మండలంలోని అత్తివరం పీహెచ్‌సీ ఉదయం 9.15 గంటలకు కూడా తెరుచుకోలేదు. వైద్యం కోసం వచ్చిన రోగులు ఎదురుచూడాల్సి వచ్చింది. తరువాత స్వీపర్, ఫార్మసిస్టు ఏఎన్ఎం, ఎంఎన్‌వో హాజరయ్యారు.

**పెళ్లకూరు:** మండలంలోని చెంబేడు పీహెచ్‌సీలో ఇద్దరు డాక్టర్లు ఉండగా, ఒకరు సకాలంలో విధులకు హాజరుకాగా మరొకరు గైర్హాజరయ్యారు. పెళ్లకూరు పీహెచ్‌సీలో ఇద్దరు డాక్టర్లు ఉండగా ఒకరు మాత్రమే విధులకు వచ్చారు. పెళ్లకూరు, చెంబేడు పీహెచ్‌సీల్లో స్టాఫ్ నర్సు, ఫార్మసిస్టులు సకాలంలో విధులకు వచ్చారు.

**సూళ్లూరుపేట:** మన్నారుపోలూరు అర్బన్ పీహెచ్‌సీలో ఉదయం 10 గంటల వరకు వైద్యులు రాలేదు. స్టాఫ్ నర్సు, హెల్త్ అసిస్టెంట్ వచ్చారు. వైద్య సిబ్బంది రోగులకు మందులు అందజేశారు.

**దొరవారిసత్రం:** మండలంలోని తొగరాముడి పీహెచ్‌సీ సముద్రతీర ప్రాంతంలో ఉండటంతో అక్కడ కాల్ డ్యూటీ వైద్యసేవలు అందిస్తున్నారు. పీహెచ్‌సీని ప్రతిరోజు సాయంత్రం 4 గంటలకు మూసివేసి సిబ్బంది వెళ్లిపోతున్నారు.

### రోగులకు ఇబ్బంది లేకుండా చర్యలు

వైద్యులు సమ్మెలో ఉన్న కారణంగా రోగులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఆస్పత్రుల్లో ఇతర సిబ్బంది రోగులకు అవసరమైన సేవలు అందించాలి. ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటాం.

- డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాసులురెడ్డి

## వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి రథోత్సవం



మల్లాం వీధుల్లో ఊరేగుతున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి - రథం ముందు పొలి టెంకాయలు కొడుతున్న భక్తులు

చిట్టమూరు, సెప్టెంబర్ 18: మండలంలోని మల్లాంలో జరుగుతున్న వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం రథోత్సవం వైభవంగా సాగింది. వళ్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను అలంకరించిన తేరుపై కొలువుదీర్చి మల్లాం పురవీధుల్లోకి ఊరేగించారు. హరోం... హర... అంటూ షణ్ముకుని తలుస్తూ భక్తులు రథాన్ని లాగారు. భక్తులు మిరియాలు, ఉప్పు రథంపై చల్లి మొక్కులు తీర్చుకున్నారు... అలాగే రథం ముందు వందల సంఖ్యలో పొలిటెంకాయలు కొట్టారు. రథోత్సవానికి భక్తులు భారీసంఖ్యలో రావడంతో వాకాడు సీఐ హుస్సేన్ భాషా, చిట్టమూరు, వాకాడు, కోట ఎస్ఐలు చిన్న బలరామయ్య, నాగబాబు పవన్‌కుమార్ సిబ్బందితో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు. మల్లాం యూత్ ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర, శీతల పానియాలు, మజ్జిగ, మంచినీళ్ల ప్యాకెట్లను అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కామిరెడ్డి మునిశేఖర్‌రెడ్డి, కామిరెడ్డి సునీల్‌రెడ్డి, కోదండరామిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, చెంచుకృష్ణారెడ్డి పాల్గొన్నారు. కాగా, బ్రహ్మోత్సవాల్లో నేడు షణ్ముకస్వామి కల్యాణ మహోత్సవం జరుగనుంది.

## పరిసరాల శుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత


కాలువల్లో బ్లీచింగ్ చల్లుతున్న మట్టం శ్రావణి

గూడూరు, సెప్టెంబరు 18: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ప్రతిఒక్కరు బాధ్యతగా భావించాలని తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి అన్నారు. బుధవారం మండలంలోని చెన్నూరు గ్రామంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా పరిసరాలను శుభ్రం చేసి కాలువల్లో బ్లీచింగ్ చల్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు చెత్తాచెదాలను రోడ్లపై వేయకుండా కుండీల్లో వేయాలని సూచించారు. కార్యక్రమంలో హేమంత్‌రెడ్డి, భాస్కర్, శ్రీనివాసులు, నాగేంద్ర, చంద్ర, మధు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా మాళవ్యానగర్‌లోని సచివాలయంలో మాజీ కౌన్సిలర్లు ఇశ్రాయిల్ కుమార్, బిల్లు చెంచురామయ్య ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ గ్రామసభను నిర్వహించారు.

**చిల్లకూరు:** మండలంలోని బూదనం పంచాయతీలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని చెత్తదిబ్బలను తొలగించడంతో పాటు, కాలువలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో వెంకటరమణ, ఈవోపీఆర్‌డీ మాణిక్యం, సర్పంచు నాగలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి

వెంకటగిరి, సెప్టెంబరు 18: ప్రతి విద్యార్థి చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సీఐ ఏవీ రమణ అన్నారు. బుధవారం పట్టణంలోని ఐఐహెచ్‌టీ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాలు ఏ విధంగా జరుగుతాయి, వాటిని ఎలా గుర్తించి నియంత్రించాలి, పోలీసులను ఆశ్రయించాల్సి విధానాలు, ట్రాఫిక్ నియంత్రణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

# మూగజీవాల సేవలో 67 వసంతాలు

## నేడు వెటర్నరీ కళాశాల వార్షికోత్సవం



తిరుపతిరూరల్, సెప్టెంబరు 18: తిరుపతి కేంద్రంగా 1957లో ఏర్పాటైన ఎస్వీ వెటర్నరీ కళాశాల 67 సంవత్సరలుగా మూగజీవాల సేవలో తరిస్తోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1955లో బాపట్లలోని వ్యవసాయ కళాశాల ప్రాంగణంలో ఆంధ్రా వర్సిటీకి(యానిమల్ హజబెండరీ విభాగం) అనుబంధంగా ఏర్పాటు చేసిన ఈ కళాశాలను రెండేళ్ల తర్వాత తిరుపతికి మార్చు చేశారు. తొలినాళ్లలో ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని మొదటి అంతస్తులో నిర్వహించారు. తర్వాత పూర్తి స్థాయిలో శాశ్వత కళాశాల, క్లినికల్, వసతి గృహ భవనాలను ఏర్పాటు చేయగా 2005నుంచి ఎస్వీ వెటర్నరీ వర్సిటీకి అనుబంధంగా నడుస్తోంది. పశువైద్య విద్యలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొంది, అనేక అవార్డులు సొంతం చేసుకుంది. వెటర్నరీ కళాశాల ఆడిటోరియంలో గురువారం మధ్యాహ్నం 3.30 గంటలకు జరిగే 61వ కాలేజ్ డేని పురస్కరించుకుని కళాశాలను అందంగా ముస్తాబు చేశారు.

### యూజీలో 4,144మంది, పీజీలో 1,015మంది డిగ్రీలు

ఈ కళాశాలలో ఇప్పటివరకు యూజీ(బీవీఎస్సీ) కోర్సుల్లో 4,144మంది, పీజీ(ఎంవీఎస్సీ)లో 1,015మంది, పీహెచ్‌డీలో 159మంది డిగ్రీలు పొందారు. ఈ విద్యా సంవత్సరం 472మంది యూజీ విద్యార్థులు, 80మంది పీజీ, పీహెచ్‌డీ విద్యను అభ్యసిస్తున్నారు. అనాటమీ, పాథాలజీ మ్యూజియంలు, ఐవీఎఫ్ ప్రయోగశాల వంటివి ప్రత్యేక గుర్తింపు సంతరించుకున్నాయి. దేశవాళీ ఆవు దూడలను పిండోత్పత్తి విధానంలో పుట్టించడం, సమీకృత దాణా తయారీ కేంద్రం, ఆధునిక పౌల్ట్రీ, పందుల పెంపక కేంద్రం, పశు ఉత్పత్తుల తయారీ, విక్రయశాల, ఆహార పరీక్షా కేంద్రం, ఆధునిక జంతువధ శాలలు సాంకేతిక విధానంలో నిర్వహిస్తూ విద్యాభివృద్ధికి విశేష కృషి చేస్తోంది.

### నేటి వార్షికోత్సవానికి ఏర్పాట్లు పూర్తి



61వ వార్షికోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. అనంత్య-2కే24పేరిట ఈ కాలేజ్‌డే సెలబ్రేషన్స్ నిర్వహిస్తున్నాం. ముఖ్య అతిథిగా ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ డాక్టర్ జేవీరమణ, ప్రత్యేక అతిథిగా వేలూరు ఫారెస్ట్ డివిజన్ జిల్లా అధికారి డాక్టర్ డి.గురుస్వామి హాజరుకానున్నారు.

- డాక్టర్ జగపతిరామయ్య, అసోసియేట్ డీన్

## నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు

కోట, సెప్టెంబరు 18: వాహనదారులు నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు చేపడుతామని ఏఎంవీఐలు ప్రభాకర్, శాంతి అన్నారు. బుధవారం మండలంలోని విద్యానగర్, చిట్టేడు ప్రాంతాల్లో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానంగా ఆటోల్లో అధికంగా ప్రయాణికులను తరలిస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వాకాడు మండలం జాంద్రపేట వద్ద మంగళవారం విద్యార్థులతో ప్రయాణిస్తున్న ఆటో బోల్తాపడిన సంఘటనలో పది మంది గాయపడడం జరిగిందన్నారు. ఎక్కువ మంది ప్రయాణికులతో రవాణా సాగించే వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తప్పనిసరిగా నిబంధనలకు లోబడి వాహనాలను నడపాలన్నారు. కార్యక్రమంలో శీను, సిబ్బంది పాల్గొన్నారు.

## క్రీడలతో మానసికోల్లాసం


ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న ఎంపీపీ గోను రాజశేఖర్

డక్కిలి, సెప్టెంబరు 18: క్రీడలు వల్ల విద్యార్థులకు మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం కలుగుతుందని ఎంపీపీ గోను రాజశేఖర్ అన్నారు. బుధవారం స్థానిక బాలయోగి గురుకుల కళాశాల క్రీడా మైదానంలో విద్యార్థులకు నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలని చెప్పారు. క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ ఉంటుందన్నారు. అంతే కాకుండా క్రీడలు విద్యార్థులకు చక్కడి నడవడిక నేర్పుతాయన్నారు. బుధవారం నిర్వహించిన అండర్ 17 క్రీడా పోటీల్లో 800 మీటర్లు బాలుర విభాగంలో మునిచరణ్, మునీంద్ర(జడ్పీ హైస్కూలు, తీర్థంపాడు) ప్రథమ, ద్వితీయ స్థానాలు, వడ్డిపల్లి జడ్పీ హైస్కూలు విద్యార్థి హరి తృతీయ స్థానంలో నిలిచారు. అలాగే బాలికల విభాగంలో బి.సునీత(డక్కిలి గురుకులం), పావని(గురుకులం), సింధు(డక్కిలి జడ్పీహెచ్ఎస్) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానం సాధించారు. ఇక వంద మీటర్లు పరుగు పందెంలో చెంచుకృష్ణ, పెంచలయ్య, శశిధర్ విజయం సాధించగా, బాలికలు విభాగంలో సచిత, జ్యోతి, గురులక్ష్మి విజేతలుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీప్రసన్న కుమారి, ఎంఈవో పిన్నక జగదీష్ బాబు, పీఈటీ వెంకటయ్య, డక్కిలి హైస్కూల్ విద్యాకమిటీ చైర్మన్ దందవోలు వెంకటరమణారెడ్డి, బాలయోగి కురుకుల పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ రత్నయ్య, స్థానిక టీడీపీ నాయకులు డక్కిలి చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 18: పట్టణంలోని బంగారుపేటలో వద్ద జరిగిన ప్రమాదంలో ఇద్దరు తీవ్ర గాయాలైన ఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.... గూడూరు నుంచి రాజేశ్వరమ్మ, ఆమె కుమారుడు ద్విచక్ర వాహనంలో వెంకటగిరికి వెళ్తుండగా బంగారుపేటలో వద్ద పెద్ద గుంతను తప్పించబోయి అదుపుతప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో తల్లి కుమారుడికి తీవ్ర గాయాలవడంతో వారిని వెంకటగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

## పోలేరమ్మ జాతర రెండవ చాటింపు

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 18: వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతరకు రెండవ చాటింపు బుధవారం అర్ధరాత్రి సంప్రదాయ బద్ధంగా జరిగింది. పట్టణంలోని గాలిగంగు దేవస్థానం వద్ద జాతర నిర్వాహకులు, దేవదాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. అనంతరం ఆసాదుల తప్పెట్లు మోతలు, కేరింతల మధ్య ఈనెల 25, 26వ తేదీల్లో పోలేరమ్మ జాతర జరుగుతుందని చాటింపువేశారు. కార్యక్రమంలో పోలేరమ్మ దేవస్థానం ఈవో శ్రీనివాసులు రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థినికి అభినందన

కోట, సెప్టెంబరు 18: మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ తృతీయ సంవత్సరం చదువుతున్న గాయత్రి ఈ నెల 7నుంచి 17వ తేదీ వరకు కేరళలో జరిగిన జాతీయ ట్రెక్కింగ్ క్యాంప్ కల్చరల్ విభాగంలో ప్రతిభ చూపి ప్రసంశాపత్రాలు అందుకున్నారు. బుధవారం కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, విభాగాధిపతి డాక్టర్ నారాయణరావు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి షీల్డ్‌లు, మెమొంటోలతో అభినందించారు.

## ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ ఎన్నిక

కోట, సెప్టెంబరు 18: ఎస్సీ వర్గీకరణ ఉమ్మడి నెల్లూరు జిల్లా వ్యతిరేక పోరాట సమితిని బుధవారం కోట పట్టణంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా మీజూరు మాధవ్, ప్రధాన కార్యదర్శిగా బందిల రంగనాథ్, కార్యదర్శిగా పారా మల్లికార్జున్, వసంత్, లీగల్ అడ్వైజర్‌గా దాసరి అశోక్‌కాంబ్లే, ఉపాధ్యక్షులుగా పనబాక హేమంత్, పసల చిరంజీవులను ఎన్నుకున్నారు. అలాగే గౌరవ సలహాదారుగా డాక్టర్ రామకృష్ణరావు, కృష్ణయ్య, దాసరి సుందరం ఎన్నికయ్యారు.

## కోటమ్మ ఆలయంలో పౌర్ణమి హోమం


హోమాలు చేస్తున్న వేదపండితులు

కోట, సెప్టెంబరు 18: కోటలోని గ్రామదేవత కోటమ్మ ఆలయంలో బాద్రపద పౌర్ణమిని పురస్కరించుకొని బుధవారం లలితా హోమాలు జరిగాయి. వేదపండితుల ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్ మోహన్‌రెడ్డి, కవితమ్మ దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక హోమాలు జరిగాయి.

# వంద రోజుల్లో ఏం చేశామంటే...



ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 18: నియోజక వర్గంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజుల్లో శరవేగంగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలతో పాలన జరిగిందని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి మండలం ఊరందూరులోని ఆయన నివాసంలో బుధవారం కూటమి ప్రభుత్వం ఏర్పడి వందరోజులు పూర్తికావడంపై మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శ్రీకాళహస్తి నియోజకవర్గంలో వైసీపీ ప్రభుత్వం హయాంలో అరాచకత్వం రాజ్యమేలిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రౌడీయిజంపై ఉక్కుపాదం మోపి ప్రజలకు ప్రశాంత వాతావరణం కల్పించామని చెప్పారు. ఇక ముక్కంటి ఆలయంలో దళారీ వ్యవస్థను నిర్మూలించడంతో పాటు వైసీపీ అక్రమాలకు సహకరించిన వారిపై చర్యలు తీసుకున్నామన్నారు. పారదర్శక పాలనతో ముక్కంటి ఆలయ ఆదాయం మూడు నెలల్లోనే గణనీయంగా పెరిగిందన్నారు. ప్రస్తుతం ఆలయంలో రోజుకు సగటున 3వేలు రాహుకేతు పూజలు నమోదు అవుతున్న సంఖ్యను 25 వేలకు తీసుకెళ్తామన్నారు. మాస్టర్ ప్లాన్ అమలుకు అడ్డంకులు తొలగించామని, శ్రీకాళహస్తిని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు రూ.140కోట్ల పనులను కేంద్రప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని చెప్పారు. దివంగత మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి మానస పుత్రిక స్కిట్ కళాశాల వైసీపీ పాలనలో మూతపడిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలల్లోనే జేఎన్‌టీయూలో విలీనం చేసేందుకు ప్రభుత్వం కమిటీ నియమించిందన్నారు. ఆరు నెలల్లో పూర్వ వైభవం తీసుకువస్తామన్నారు. ఇక ప్రభుత్వ వసతి గృహాల్లో సొంత నిధులతో సమస్యలు పరిష్కరించామన్నారు. గంజాయి అమ్మకాలు, లాటరీ, మట్కాపై కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ భూములను మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తన అనుచరులతో భారీగా స్వాహా చేసినట్లు వెలుగులోకి తెచ్చామన్నారు. అలాగే భూముల స్కాంపై దర్యాప్తు సంస్థలతో లోతుగా విచారణ చేయిస్తున్నామన్నారు. ఆరు నెలల్లో భూబకాసురులను జైలుకు పంపుతామన్నారు. రాజీవ్ నగర్‌లో పనస కాలువకు కబ్జా చేసి నిర్మించిన అక్రమ కట్టడాలను కూల్చివేయడం, అదే ప్రాంతంలో పేదల కోసం కేటాయించిన ఇంటి స్థలాల కబ్జాపై ఏకకాలంలో 52 బృందాలతో దర్యాప్తు చేసి లబ్ధిదారులకు న్యాయం చేస్తున్నామన్నారు. శ్రీకాళహస్తి పురపాలక సంఘ పరిధిలో వరద ముప్పును తప్పించేందుకు రూ.50లక్షలతో యుద్ధప్రాతిపదికన 6.5 కి.మీ. డ్రైనేజీ వ్యవస్థను ప్రక్షాళన చేశామన్నారు. అలాగే నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాల్లో తాగునీటి బోర్లు, విద్యుత్ దీపాలను గెలిచిన 15 రోజుల్లోనే ఏర్పాటు చేశామని చెప్పారు.

## దారి చూపండి

- చిత్తూరు-తచ్చూరు ఎక్స్‌ప్రెస్ హైవే భూ బాధితులు
- సర్వీస్ రోడ్డు కోసం నేడు చిత్తూరులో ధర్నా
- 22న వంటావార్పు
- సీపీఐ జాతీయ నేత నారాయణ రాక



రైతులతో సీపీఐ, రైతు సంఘు నాయకులు

పిచ్చాటూరు, సెప్టెంబరు 18: చిత్తూరు - తచ్చూరు ఎక్స్‌ప్రెస్ హైవే కోసం భూములు ఇచ్చిన రైతాంగం నోట్లో మట్టి కొట్టేందుకు కేంద్ర ఉపరితల రవాణా శాఖ యత్నిస్తోందని సీపీఐ, రైతు సంఘం నేతలు పేర్కొన్నారు. మంగళవారం రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను సీపీఐ, రైతు సంఘం ప్రతినిధి వర్గం అడిగి తెలుసుకుంది. ఈ సందర్భంగా కారూర్, పాదిరి, బూచివానత్తం, అయనంబాకం, కాళికాపురం, దామరపాకం గ్రామాలకు చెందిన రైతులు మాట్లాడుతూ... సీపీఐ, రైతు సంఘం సహకారంతో తమ భూములకు పరిహారం ఎకరాకు రూ.8 లక్షల నుంచి 16 లక్షలకు పెంచుకో గలి గామన్నారు. అయితే రహదారి పూర్తి కావస్తున్నా ఎంవోయూకు విరుద్ధంగా సర్వీస్ రోడ్డు నిర్మించకపోవడం దుర్మార్గమన్నారు. అలాగే పలు చోట్ల రోడ్డుకిరువైపులా ఉన్న గ్రామాలకు, పొలాలకు సబ్‌వే ఏర్పాటులో పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారన్నారు. రైతాంగ సమస్యల పరిష్కారానికి బుధవారం చిత్తూరులో ధర్నా, అలాగే 22న రహదారిపైన వంటా వార్పు కార్యక్రమం చేపట్టబోతున్నామని, సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ హాజరు కానున్నారని సీపీఐ, రైతు సంఘ నాయకులు ప్రకటించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏ.రామానాయుడు, రైతు సంఘం నేత జనార్దన్, సీపీఐ జిల్లా నాయకులు చిన్నిరాజ్, మహేష్, గురుమూర్తి, చిరంజీవి నాయుడు, కృష్ణారెడ్డి కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినుల పట్ల అసభ్య ప్రవర్తన

### ఉపాధ్యాయుడి సస్పెన్షన్

రేణిగుంట, సెప్టెంబరు 18: విద్యార్థినుల పట్ల ఓ ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తించడంతో విద్యాశాఖ అధికారి సదరు టీచర్‌ను సస్పెండ్ చేశారు. డీవైఈవో బాలాజీ తెలిపిన వివరాల మేరకు... రేణిగుంట మండలం ఆర్‌మల్లవరం జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఇద్దరు విద్యార్థినిల పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు వారు తెలిపారు. దీంతో వారు హెచ్‌ఎంకు ఫిర్యాదు చేశారు. జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లగా బుధవారం డీఈవో శేఖర్, డీవైఈవో బాలాజీ, ఎంఈవోలు ఇంద్రాదేవి, రంగనాథయ్య విచారణ చేపట్టారు. విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుడు రవిని వేర్వేరుగా విచారించారు. ఈ విచారణలో ఉపాధ్యాయుడు తప్పు చేశాడని నిర్ధారణ కావడంతో ఆయన్ను సస్పెండ్ చేస్తూ డీఈవో శేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే పాఠశాలలోని కొంతమంది ఉపాధ్యాయులు తనపై కుట్ర పన్ని ఇరికించారని ఉపాధ్యాయుడు రవి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## మద్యం సీసాల స్వాధీనం

వరదయ్యపాళెం, సెప్టెంబరు 18: మండలంలోని రాచెర్ల పంచాయతీ మోపూరుపల్లిలో మద్యం బెల్ట్ దుకాణం నిర్వహిస్తున్న వ్యక్తిని మంగళవారం సాయంత్రం శ్రీసిటీ పోలీసులు అరెస్టు చేసి అతని నుంచి తమిళనాడు మద్యం స్వాధీనం చేసుకున్నారు. మోపూరుపల్లిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారంతో శ్రీసిటీ పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు, సిబ్బంది ప్రత్యేక నిఘా ఉంచారు. మోపూరుపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో ఓ చిల్లర దుకాణం వద్ద మహేష్ అనే వ్యక్తి మద్యం సంచితో వస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. మద్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడిని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు శ్రీసిటీ పోలీసులు తెలిపారు.

## బసవయ్యపాళెంలో అన్నదానం



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 18: ప్రధానమంత్రి మోదీ జన్మదిన వేడుకల్లో భాగంగా బుధవారం తొట్టంబేడు మండలం బసవయ్యపాళెంలో బీజేపీ నాయకులు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అదే విధంగా పేదలకు న్యూట్రిషియన్ ఫుడ్, వృద్ధులకు, మహిళలకు దుస్తులు, విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఎం.సుబ్రహ్మణ్యంరెడ్డి, ఎస్వీ రమణ, టీడీపీ మండల అధ్యక్షుడు గాలి మురళీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## అధిక రసాయనాలతో సాగులో అనర్థాలు



బండారుపల్లిలో వంగతోట పరిశీలన

ఏర్పేడు, సెప్టెంబరు 18: అధిక మోతాదులో రసాయన ఎరువులు, పురుగు, కలుపు మందుల వినియోగంతో మేలుకంటే కీడే జరుగుతుందని జిల్లా వ్యవసాయ వనరుల ఏడీఏ భాస్కరయ్య తెలిపారు. మండలంలోని బండారుపల్లిలో జరిగిన రైతు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... సేంద్రియ ఎరువు, పచ్చిరొట్ట వంటి జీవన ఎరువుల వాడకంతో నేలలో జీవాన్ని పెంచవచ్చన్నారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ నాగమణి, శ్రీకాళహస్తి ఏడీఏ రమేష్‌రెడ్డి, ఏవో షణ్ముగం, గ్రామ వ్యవసాయ సహాయకులు మహేష్, ఇఫ్కో క్షేత్రాధికారి మణిచంద్ర, రైతులు పాల్గొన్నారు. అంతకుముందు బండారుపల్లిలో వంగతోటను పరిశీంచారు.

**శ్రీకాళహస్తి:** కూరగాయల సాగుతో సన్న, చిన్నకారు రైతులకు రోజువారి ఆదాయం లభిస్తుందని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఏడీఏ భాస్కరయ్య తెలిపారు. శ్రీకాళహస్తి మండలం టీఎంఆర్‌కండ్రిగలో ఆయన రైతులకు శిక్షణ ఇచ్చారు. తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త నాగమణి, శ్రీకాళహస్తి ఏడీఏ రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తే నాన్‌బెయిలబుల్ కేసులు



సిబ్బందికి సూచనలిస్తున్న తహసీల్దార్

పిచ్చాటూరు, సెప్టెంబరు 18: ఇసుక, మట్టిని అక్రమంగా తరలిస్తే నాన్ బెయిలబుల్ కేసులు తప్పవని తహసీల్దార్ రమేష్‌బాబు హెచ్చరించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. అరుణా నది నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న గ్రామాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని ఆర్ఐ, వీఆర్‌వోలను ఆదేశించారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు, టిప్పర్లు సీజ్ చేసి పోలీసులకు అప్పగించాలన్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీ సీజ్

పిచ్చాటూరు మండల పరిధిలో మంగళవారం అర్ధరాత్రి ఇసుకను తరలిస్తున్న లారీని పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్లతో ఇసుక తోలి లారీకి లోడ్ చేసి తమిళనాడుకు తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని లారీతో పాటు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

## కళాశాలలో కంటి పరీక్షలు




శ్రీకాళహస్తి, సెప్టెంబరు 18: పట్టణంలోని ఎస్వీఏ ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో బుధవారం ఆర్‌ఆర్‌సీ, వైఆర్‌సీ, మహిళా సాధికారత విభాగం, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో డాక్టర్ అగర్వాల్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. వైద్యులు వినయ్, ఈశ్వరయ్య, ప్రిన్సిపాల్ ఎం.శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ నేతల అక్రమ కట్టడాల తొలగింపు



అధికారులు కూల్చి వేసిన భవనం

ఏర్పేడు, సెప్టెంబరు 18: మండలంలోని వికృతమాల పంచాయతీలో గత ప్రభుత్వ హయాంలో కొంతమంది వైసీపీ నేతలు ప్రభుత్వ స్థలాల్లో దర్జాగా అక్రమంగా ఇళ్లను నిర్మించారు. ఈ సమయంలో స్థానికులు ఫిర్యాదు చేస్తే అధికారులు తూతూమంత్రంగా పరిశీలించి అక్రమార్కుల వద్ద భారీ స్థాయిలో మామూళ్లు తీసుకున్నట్టు విమర్శలున్నాయి. దీంతో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత స్థానికులు మరో సారి ఫిర్యాదుల పరంపరం కొనసాగించారు. ఈ మేరకు అధికారులు పరిశీలించి బుధవారం వాటిని రెవెన్యూశాఖ, పోలీసుల సహకారంతో తొలగించారు. కొంతమంది వైసీపీ నేతల అక్రమ కట్టడాలను మాత్రమే అధికారులు తొలగించారని కొందరివి తొలగించలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వికృతమాల సర్పంచ్ తండ్రి, వైసీపీ సీనియర్ నాయకుడు రామ్మూర్తి సర్వే నెం.51లో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి నిర్మించిన ఇంటిని బుధవారం తొలగించారు. అదే విధంగా గత ప్రభుత్వ హయాంలో పలువురు వైసీపీ నాయకులు కూడా 10 ఇళ్ల వరకు నిర్మించారు. ఆ ఇళ్ల జోలికి అధికారులు పోలేదు. వైసీపీ సీనియర్ నేత దళిత సంఘ నాయకుడు రామ్మూర్తి నిర్మించిన నిర్మాణాలను మాత్రమే తొలగించారు తప్ప అగ్రవర్ణాలకు చెందిన మాజీ వీఆర్వో నిర్మించిన కట్టడాలను మాత్రం తొలగించలేదు.

## క్యాన్సర్ వైద్య శిబిరానికి స్పందన



కేవీబీపురం, సెప్టెంబరు 18: మండలంలోని సదాశివపురంలో రాస్ ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. మందులతో పాటు వృద్ధులకు చేతికర్రలు, దుప్పట్లను పంపిణీ చేశారు. టాటా ట్రస్టు డాక్టర్ వెంకయ్యబాబు బృందం తదితరులు శిబిరంలో పాల్గొన్నారు.

## వీఆర్వోలు పనితీరు మార్చుకోవాలి

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 18: వీఆర్వోలు పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని తహసీల్దార్ సుబ్రమణ్యం హెచ్చరించారు. తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం వీర్వోలు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడమే కాకుండా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో ఈ-క్రాప్ మొదలపెట్టాలన్నారు. డీటీ చంద్రబాబు నాయుడు తదితరులు పాల్గొన్నారు

## చేతిబోరుకు మరమ్మతులు

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 18: మండల కేంద్రంలోని తెలుగుగుంగ కాలనీ, వారంతపు సంత ప్రదేశంలో చేతిబోరుకు ఎట్టకేలకు అధికారులకు మరమ్మతులు చేపట్టారు. గత ఐదు సంవత్సరాల క్రితం ఈ బోరు మరమ్మతులకు గురైంది. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కార్యదర్శి ఇందిరమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి సూర్య, ఉప సర్పంచ్ మునిరాజా ఆధ్వర్యంలో చేతిబోరుకు కొత్త పైపులు అమర్చి తాగునీటిని అందించారు.

## వైద్య శిబిరం

సత్యవేడు, సెప్టెంబరు 18: పరిశుభ్రత కోసం ప్రతి ఒక్కరు వ్యక్తిగత బాధ్యతను తీసుకోవాలని సత్యవేడు ఎంపీడీవో చంద్రశేఖర్ కోరారు. స్వచ్ఛతహే సేవా కార్యక్రమంలో భాగంగా స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ మంజుల రమేష్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికుల కోసం ఉచిత వైత్య శిబిరం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి మునికుమార్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

## సమతుల ఆహారమే ఆరోగ్యానికి శ్రీరామ రక్ష

సత్యవేడు, సెప్టెంబరు 18: సమతుల ఆహారమే ఆరోగ్యానికి శ్రీరామరక్ష అని సత్యవేడు మండలంలోని మదనంబేడు ఏఎన్‌ఎం సరస్వతి అన్నారు. బుధవారం మదనంబేడులోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చెంచులక్ష్మీ ఆధ్వర్యంలో పౌష్టిక మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎన్‌ఎం సరస్వతీ మాట్లాడుతూ ఆకుకూరలు, పండ్లు సమృద్ధిగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలన్నారు. అలాగే గర్భవతులు, బాలింతలు బలవర్ధకమైన ఆహారాన్ని తీసుకున్నప్పుడే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఉషా, విజయలక్ష్మీ, ఆశావర్కర్లు యశోద, తేన్మయి, మహిళా పోలీస్ భవాని తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా కల్యాణ వెంకన్న పవిత్రోత్సవాలు



పవిత్రాల ఊరేగింపులో అర్చకులు

నారాయణవనం, సెప్టెంబర్ 18: మండలంలోని టీటీడీ అనుబంధ ఆలయం కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాల్లో భాగంగా మూలవర్లకు పవిత్రాలు సమర్పించారు. బుధవారం ఉదయం పట్టు పవిత్రాలను ఆలయ అంతర ప్రాకరంలో ఊరేగించి యాగశాలలో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఆలయంలోని మూలవర్లకు, ఉత్సవ విగ్రహాలకు, పరివార దేవతలకు పవిత్రాలను సమర్పించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి తిరుచ్చిపై గ్రామంలో విహరించారు. డిప్యూటీ ఈవో నాగరత్నం, సూపరిటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు ఉత్సవాలను పర్యవేక్షించారు.

## నందిపై విభుడి వైభవం



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 18: శ్రీకాళహస్తీశ్వర స్వామి తన దేవేరి జ్ఞాన ప్రసూనాంబతో బుధవారం పట్టణంలో విహరించారు. ఆలయం లోని అలంకార మండపంలో స్వామిఅమ్మవార్లకు పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల, వేదమంత్రోచ్ఛరణల నడుమ శ్రీకాళహస్తీశ్వరస్వామిని నందివాహనంపై, జ్ఞానప్రసూనాంబ అమ్మవారిని సింహవాహనంపై అధిష్టింప జేశారు. పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లను భక్తులు దర్శించు కున్నారు. ఉభయదారులుగా శ్రీకాళహస్తి మండలం టీఎంవీకండ్రిగకు చెందిన రెడ్డివారి మంగమ్మ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా మజ్దూర్ యూనియన్ ఎన్నికల శంఖారావం

రేణిగుంట, సెప్టెంబరు 18: దేశవ్యాప్తంగా రైల్వే యూనియన్ ఎన్నికల శంఖారావాన్ని రేణిగుంట పట్టణం నుంచి ఆల్ ఇండియా మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీ శంకర్‌రావు పూరించారు. బుధవారం రాత్రి రేణిగుంట రైల్వేస్టేషన్ ఆవరణలో మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభలో శంకర్‌రావు మాట్లాడుతూ.. ఒకే యూనియన్ ఒకే సంస్థ నినాదంతో కార్మికులు ముందుకుపోవాలని సూచించారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న మూడో కార్మికుల యూనియన్ ఎన్నికల్లో కార్మిక నాయకులు, సభ్యులు గెలుపునకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విజయ్‌కుమార్, సుదర్శన్‌రాజు, సురేష్‌కుమార్, బాషా తదితరులు పాల్గొన్నారు.

## బీసీ సాధికారతే టీడీపీ ధ్యేయం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 18: బీసీల సాధికారతే ధ్యేయంగా టీడీపీ అడుగులు వేస్తోందని ఆ పార్టీ బీసీ విభాగ నాయకులు అన్నారు. బుధవారం వారు మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో గత ప్రభుత్వంలో బీసీ వర్గాలకు 34శాతం రిజర్వేషన్‌లో 10శాతం కోత పెట్టిన ఘరానా మోసగాడు మాజీ సీఎం జగన్ అన్నారు. నేడు అందుకు విరుగుడుగా సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం బీసీలకు 33శాతం రిజర్వేషన్లను చట్టసభల్లో అమలుకు శ్రీకారం చుట్టడం ఈ హామీ అమలు చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ఈకార్యక్రమంలో మిన్నల రవి, డాక్టర్ ఎం.ఉమేష్‌రావు, నెమళ్ళూరు బుజ్జి, కోట చంద్రశేఖర్, చింతగింజల సునీల్, శివ, భాస్కర్, మణి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం

- పోలీసుల సహకారంతో మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీసులకు స్వాధీనం చేసిన ఇసుక ట్రాక్టర్లు

ఏర్పేడు, సెప్టెంబరు 18: మండలంలో ఇసుక అక్రమ రవాణా అరికట్టాలని రెవెన్యూ సిబ్బందిని తహసీల్దారు భార్గవి ఆదేశించారు. బుధవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'ఇసుక తరలిపోతుంటే ఏం చేస్తున్నారు'.. వార్త ప్రచురితం కావడంతో ఆమె స్పందించారు. స్వర్ణముఖి పరివాహక ప్రాంతాల వీఆర్వోలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ క్రమంలో స్వర్ణముఖి పరివాహక ప్రాంతాల్లో తహసీల్దారు భార్గవి, వీఆర్వోలు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గుడిమల్లం వద్ద అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లు, ఎయిర్‌పోర్టు రోడ్డులో మరో ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. వాటిని పోలీసులకు స్వాధీనం చేశారు. గాజులమండ్యానికి చెందిన ఈశ్వరయ్య, వడమాలపేటకు చెందిన జగదీష్, చెల్లూరుకు చెందిన కయ్యూరి మణిపై కేసు నమోదు చేసినట్టు సీఐ జయచంద్ర చెప్పారు.

## తమ్ముడి రేకుల ఇంటిని పీకేసిన అన్న

కేవీబీపురం, సెప్టెంబరు 18: మండలంలోని ఆదవరంలో ఆస్తి వివాదం అన్నదమ్ముల మధ్య చిచ్చు రేపింది. బత్తెయ్య, కృష్ణయ్య అన్నదమ్ములు. ఆదవరంలోని ఇంటి స్థలం, పొలాలను తన తండ్రి లక్ష్మయ్య ద్వారా సంక్రమించిన వాటిని బత్తెయ్య ఆక్రమించి కృష్ణయ్యకు తెలియకుండా తన కుమారులు జానకిరామ్ పేరుమీద రిజిస్ట్రేషన్ చేయించారు. గ్రామంలో మధ్యస్థం పెట్టగా పెద్దలు కృష్ణయ్యకు ఇంటి స్థలం ఇవ్వాలని బత్తెయ్యకు చెప్పారు. దీంతో కృష్ణయ్యకు స్థలం ఇచ్చారు. ఆ స్థలంలో కృష్ణయ్య రేకుల ఇంటిని నిర్మించుకున్నాడు. ఆ రేకుల ఇంటిని బుధవారం బత్తెయ్య, అతని కుమారులు జానకిరామ్, కుమారస్వామి పీకేశారు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## వీడియో, రీల్స్ పోటీలకు 24వరకు గడువు తేదీ

తిరుపతి(విద్య), సెప్టెంబరు 18: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా వీడియోలు, రీల్స్ పోటీలు నిర్వహించనున్నట్టు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ప్రాంతీయ పర్యాటక శాఖ అధికారి రమణప్రసాద్, జిల్లా పర్యాటకశాఖ అధికారి రూపేంద్రనాథ్‌రెడ్డితో కలిసి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈనెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రాల సమాచారాన్ని పర్యాటకులకు తెలియజేస్తూ ఆకట్టుకునే విధంగా వీడియోలు, రీల్స్ రూపొందించాల్సి ఉంటుంది

- **మొదటి కేటగిరి:** తిరుమల శ్రీవారు, తిరుపతి గోవింద రాజస్వామి, తిరుచానూరు పద్మావతి అమ్మవారు, అప్పలాయగుంట ప్రసన్న వెంకటేశ్వర స్వామి, గుడిమల్లం పరశురామేశ్వరస్వామి, శ్రీకాళ హస్తి శ్రీకాళహస్తీశ్వరస్వామి, నారాయణవనం కల్యాణ వెంకటేశ్వరస్వామి, నాగలాపురం వేదనారాయణస్వామి, సురుటుపల్లి పల్లికొండేశ్వరస్వామి ఆలయాలపై నిమిషం నిడివితో వీడియో, 15 నుంచి 30 సెకన్ల నిడివితో రీల్
- **రెండవ కేటగిరి** : జిల్లాలోని ఎస్వీ జూలాజికల్ పార్క్, కళ్యాణి డ్యామ్, చంద్రగిరి కోట, తలకోన జలపాతం, తలకోన, మామండూరు ఎకో టూరిజం, కైలాసనాథకోన జలపాతం, శ్రీసిటీ, తూపిలిపాళెం బీచ్, ఇరకం ఐలాండ్, పులికాట్ సరస్సు, నేలపట్టు పక్షుల అభయారణ్యంపై నిమిషం నిడివితో వీడియో, 15-30 సెకన్ల నిడివితో రీల్స్

బహుమతులు: వీడియో లేదా రీల్‌కు ప్రథమ బహుమతి రూ.లక్ష, ద్వితీయ బహుమతి రూ.50వేలు, తృతీయ బహుమతి రూ.25వేలు ఉంటుంది.రీల్స్, వీడియోలను edtpt@aptdc.in లేదా collector-tirupati@ap.gov.inలకు ఈనెల 24వ తేదీ లోపల ఈ మెయిల్ ద్వారా పంపాలి. వివరాలకు tirupati.ap.gov.inలో గాని, 6309942027, 9848823086, 9705933311లలో గాని సంప్రదించవచ్చు.

## నేడు 2కే రన్

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 18: తిరుపతి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం పట్టణంలో డీఎస్పీ నరసింహమూర్తి ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలు, మహిళలపై జరిగే నేరాలు, సైబర్ నేరాల, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కోసం 2కే రన్ నిర్వహించనున్నారు. పట్టణంలోని దిన్నూల్ నుంచి ఉదయం 6గంటలకు ప్రారంభమై స్కిట్ కళాశాలకు చేరుకోనుంది. ఈ ర్యాలీని విజయవంతం చేయాలని డీఎస్పీ కోరారు.

## పాలకమండలిలో నాయిబ్రాహ్మణులకు అవకాశం కల్పించండి



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 18: శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలిలో తమకు అవకాశం కల్పించాలని నాయీబ్రాహ్మణులకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని కోరారు. బుధవారం ఊరందూరులోని ఎమ్మెల్యే స్వగృహంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. పాలకమండలిలో నాయీబ్రాహ్మణుల తరపున మహేంద్రకు అవకాశం కల్పించాలన్నారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్టు వారు తెలిపారు.

## వరద బాధితులకు రూ.లక్ష విరాళం



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 18: విజయవాడ వరద బాధితుల సహాయార్థం శ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్ అధినేత శ్రీనివాస్ రూ.లక్షను విరాళంగా అందజేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని కలసి చెక్కును అందజేశారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, నాయకులు గోపీనాథ్, గుత్తా విజయనాయుడు, నింద్ర సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. విజయవాడ వరద బాధితులకు ఆర్‌ఎంపీలు బుధవారం రూ.51,116ను అందించారు.ఈ సొమ్మును బుధవారం ఎమ్మెల్యేకు అందజేశారు. ఆర్‌ఎంపీలు ఏడుకొండలు, మోహన్, వీరయ్య, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ముక్కంటి సేవలో ప్రముఖులు



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 18: జ్ఞానప్రసూనాంబ సమేత ముక్కంటీశుడిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించు కున్నారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, యువ క్రికెటర్ జితేష్‌శర్మ దర్శించుకున్న వారిలో ఉన్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతంపలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దశరథాచారి, గుర్రప్పశెట్టి, కాసరం రమేష్, తదితరులు పాల్గొన్నారు.